వారు తాగిన దాంట్లో ఏముంది?

ఒక మహిళ మృతి... మరొకరికి చికిత్స

విశాలాంధ్ర- చింతలపూడి రూరల్ : వాళ్ళు తాగిన దాంట్లో ఏముంది ఆమె ప్రాణం ఎందుకు పోయింది....? అనేది చర్చనీయాంశంగా మారింది. శనివారం చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లి గ్రామంలోని మెట్టగూడానికి చెందిన గిరిజన మహిళ రమణ (60) మృతి చెందగా ఆమె సోదరుడు వెంకటేశ్వరరావు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇద్దరికీ మద్యం తాగే అలవాటు ఉందని వాళ్ళు తాగింది కల్తీ మద్యమా....? లేక ఎవరైనా వారిపైన విషప్రయోగం చేసారా ? అనేది చర్చనీయాంశంగా మారింది. కాపుసారా తాగడం వలన అది పడక చనిపోయారా...? అనేది తేలాల్సి ఉంది. విషయం తెలిసిన వెంటనే చింతలపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్ వారు నివాస ప్రాంతాలకు వెళ్లి విచారణ ప్రారంభించారు. ఎస్సై సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విశాలాంధ్ర
ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలు

గొల్లవానితిప్పలో జాతీయ సేవా శిబిరం

విశాలాంధ్ర -భీమవరం: గొల్లవానితిప్ప గ్రామంలో డిఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్.ఎస్.ఎస్. యూనిట్ ఆధ్వర్యంలో ఏడు రోజుల ప్రత్యేక సేవా శిబిరాన్ని గొల్లవానితిప్ప సర్పంచ్ వెంకటేశ్వర్లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి గ్రామాభివృద్ధిలో వారు భాగం పంచుకునేలా విద్యార్థులు అవగాహన కలిగించాలన్నారు. వలంటీర్లకు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తమ గ్రామానికి విద్యార్థులు రావడం ఆనందం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిటీసీ తాతపూడి రాంబాబు, ఉప సర్పంచ్ గరికిపాటి సురేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.ప్రవీణ్, వాలంటీర్లు పాల్గొన్నారు.

అర్జీలకు న్యాయమైన పరిష్కారం

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: పిజిఆర్ఎస్ లో ప్రజల నుండి అందిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, అర్జీదారుల ఫిర్యాదులు నిర్దేశించిన గడువులోగా వారు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ పి.జి.ఆర్.ఎస్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో పాటు డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడి డాక్టర్ కెసిహెచ్ అప్పారావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి వెంకటేశ్వర రావు జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈరోజు నిర్వహించిన పిజిఆర్ఎస్ సమావేశంలో వివిధ సమస్యల పరిష్కారానికై ప్రజలు మొత్తం 198 అర్జీలను సమర్పించారు. జెసి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖ జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమం ట్రిబునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

13న మెగాలోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - చింతలపూడి: జూనియర్ సివిల్ కోర్టులో డిసెంబర్ 13వ తేదీన జరిగే మెగా లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్ మధు బాబు కోరారు. సోమవారం కోర్టు ఆవరణలో న్యాయ వాదులతో లోక్ అదాలత్ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. మెగా లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్ ,బిఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదాలు, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు.రాజీ చేసుకునేవారు ప్రతిరోజు ఫ్రీ లోక్ అదాలత్ సెట్టింగ్స్ నిర్వహిస్తున్నారు కేసులు రాజీ చేసు కోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె. మాణిక్యాలరావు, న్యాయ వాదులు పాల్గొన్నారు.

గణేష్ సౌజన్యంతో వాలీబాల్ కోర్టు ఏర్పాటు



విశాలాంధ్ర - గణపవరం: గణపవరం హరిజన పేటలోని అంబేద్కర్ విగ్రహం సెంటర్ వద్ద అంబేద్కర్ యూత్ వారు దాత కొనిశెట్టి గణేష్‌ను వాలీబాల్ కోర్టు ఏర్పాటు చెయ్యాలని కోరారు. గణపవరం గ్రామానికి చెందిన అమెరికాలో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేసి ప్రస్తుతం గణపవరంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దాత కొనిశెట్టి గణేష్‌ను అంబేద్కర్‌యూత్ సంప్రదించి విషయం ఆయనకు చెప్పడంతో ఆయన స్పందించి గణేష్ ఆర్థిక సహకారంతో సుమారు 60 వేల రూపాయలు ఖర్చుతో అంబేద్కర్ విగ్రహం సెంటర్ వద్ద వాలీబాల్ కోర్టు చుట్టూ ఫినిషింగ్ స్పోర్ట్స్ మెటీరియల్ ఏర్పాటు చేసి సోమవారం ప్రారంభించారు. ఆ ఏరియా ప్రజలు గణేష్ ను అభినందించారు. గణేష్ మాట్లాడుతూ భవిష్యత్తులో చిన్న చిన్న సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుసుమే రవితేజ, సభ్యులు గుడిసే పండు, కొడిదే శ్రీను, ఉన్నమట్ల రమేష్, అంబేద్కర్ యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత

విశాలాంధ్ర - నరసాపురం :నరసాపురం పట్టణం 31వ వార్డుకు చెందిన కొండేటి జాన్ ఇటీవల ప్రమాదంలో మృతి చెందారు. ఈ ఘటనకు స్పందించిన టీడీపీ బాధిత కుటుంబానికి అండగా నిలిచింది.రూ.5 లక్షల ప్రమాద భీమా చెక్కును ఆయన సతీమణి కొండేటి కళ్యాణికి టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి పొత్తూరి రామరాజు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ పదే పదే ప్రజల కోసం, కార్యకర్తల కోసం పనిచేసే పార్టీ అన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం, నారా లోకేష్ బాబు పారదర్శకత ప్రజా సేవకు ప్రతీకలు అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్ కొప్పాడ రవీంద్రనాథ్, రాగూర్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పాలూరి నరసింహారావు (బాబ్జీ), తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోట డిసిసిబి వద్ద సొసైటీ ఉద్యోగుల ధర్నా

విశాలాంధ్ర-టి.నరసాపురం: సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల ఐక్య వేదిక రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో కామవరపుకోటలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వద్ద బ్యాంకు పరిధిలోని సొసైటీల ఉద్యోగులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ నెంబర్ 36 వెంటనే అమలు పరచాలని, 2019, 2024లలో పెండింగ్‌లో ఉన్న వేతనాలు సవరించి అప్పటి వరకు మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు చెల్లించే గ్రాడ్యుటీ చట్టప్రకారం చెల్లించాలి అన్నారు.సహకార సంఘాలలో పనిచేసే ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులకు మాదిరిగా రిటైర్మెంట్ వయసు 62 ఏళ్ళకు అమలు చేయాలన్నారు. ఈ ధర్నాలో కె జగ్గవరం, మధ్యాహ్నపువారిగూడెం, మల్లుకుంట సొసైటీల సిఇఓలు తనగాల వీరవెంకయ్య, జి. భుజంగరావు,కె వి వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంతకాలు సేకరణ



విశాలాంధ్ర-లింగపాలెం : వైసీపీ చేపట్టిన కోటి సంతకాల కార్యక మాన్ని లింగపాలెం మండలంలోని అయ్యప రాజుగూడెం, ధర్మాజీ గూడెంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ కంభం విజయరాజు,పార్టీ సంయుక్త కార్యదర్శి సొంగా సందీప్ లింగపాలెం మండలపార్టీ అధ్యక్షులు అన్నపనేని శాంతారావు, మండల యూత్ అధ్యక్షులు చీదరాల ప్రసాద్, ముళ్ళపూడి సుమన్,చిన్న బాబు తదితరులు పాల్గొన్నారు. వైసీపీ గ్రామపార్టీ, నాయకులు కార్యకర్తలు సంతకాల సేకరణ చేశారు.

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

పిజీఆర్ఎస్‌లో 363 అర్జీలు

విశాలాంధ్ర-ఏలూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కా రానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు,ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, డీఆర్డీఏ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం. ముక్కంటి, భాస్కర్, దేవకీదేవి, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఏ . భానుప్రతాప్, సర్వే ఏడి అన్సారీ అర్జీలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ మాట్లాడుతూ ఆయా శాఖల వారీగా వచ్చిన అర్జీ లను పరిశీలించి నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అర్జీల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు, ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని ఆదేశించారు. పీజీఆర్ ఎస్ లో ప్రజల నుంచి అందిన అర్జీల పరిష్కార సరళిపై ప్రధానంగా దృష్టి సారించాల న్నారు. పి జి ఆర్ ఎస్ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించి క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యలకు క్షేత్ర స్థాయిలోనే పరిష్కార మార్గాలు చూపించి అర్జీలు రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. సోమవారం జరిగిన పీజిఆర్ఎస్ కార్యక్రమంలో 363 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేటు సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ నాయకులు బాలకృష్ణ మృతి

పార్టీ, ప్రజా సంఘాల నేతలు సంతాపం



విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: సీపీఐ ఏలూరు జిల్లా సమితి సభ్యులు,ఏఐటీయుసి జంగారెడ్డిగూడెం మండల అధ్యక్షులు పెదసనగంటి బాలకృష్ణ (56) సోమవారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషాద సమాచారం తెలిసిన వెంటనే సీపీఐ శ్రేణులు అధిక సంఖ్యలో బాలకృష్ణ నివాసానికి చేరుకుని కన్నీటి పర్యంత మయ్యారు. బాలకృష్ణ మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య ఆవేదన వ్యక్తం చేశారు. బాలకృష్ణ మృతదేహంపై పార్టీ పతాకాన్ని కప్పి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం మండలంలో పార్టీ, ఏఐటీయూసీ అభివృద్ధికి బాలకృష్ణ విశేష కృషి చేశారని అన్నారు. నిరంతరం పార్టీ అభివృద్ధిని కాంక్షించేవాడని, ఆయన మృతి బాధాకరమన్నారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండి మునీర్, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం ధారయ్య, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, జిల్లా కార్యవర్గ సభ్యులు జంపన వెంకటరమణ రాజు, బాడిస రాము, ఉప్పులూరి హేమ శంకర్ జిల్లా సమితి సభ్యులు అయితా సురేష్ ,తాడిగడప ఆంజనేయరాజు, గొలిమే బాలయేసు, కురెళ్ళ వరప్రసాద్, అడ్డగర్ల ఇందిరా, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు మన్నవ లక్ష్మీ సౌభాగ్యవతి, కుంచే వసంతరావు, పోతన అప్పారావు లంక లక్ష్మణరావు, కిషోర్ , స్వాతి, తదితరులు బాలకృష్ణ మృతదేహంపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి వ్యక్తం చేశారు.

దేగా ప్రభాకర్ సంతాపం

చిరకాల మిత్రుడు, సుదీర్ఘకాలంగా పార్టీలో పనిచేస్తున్న బాలకృష్ణ మృతి పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ సంతాపం, కుటుంబసభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. బాలకృష్ణ వంటి నిస్వార్థ కార్యకర్తను కోల్పోవడం బాధాకరమని అన్నారు. న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు కెవి రమణ, సత్యనారాయణ తదితరులు బాలకృష్ణ మృతదేహంపై పుష్పాలు చల్లి తీవ్ర సంతాపం సానుభూతి వ్యక్తం చేశారు.

ఏలూరు: జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం (బికేఎంయు), ఏఐటీయుసి జిల్లా సమితి సంతాపం తెలియజేసింది. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయుసి జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే, సహాయ కార్యదర్శి పి.కిషోర్, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెదసనగంటి బాలకృష్ణ జంగారెడ్డిగూడెం మండలంలో ఏఐటీయుసి, పార్టీ అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కామవరపుకోట: సీపీఐ కామవరపుకోట మండల కో కన్వీనర్ జి. సత్యనారాయణ, బి కే ఎం యు నాయకులు గుమ్మడి లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ నాయకులు చలమల శ్రీనివాసరావు, మీనుగుల దుర్గారావు, మహిళా సమాఖ్య నాయకులు టి.రాములమ్మ, ప్రగాఢ సంతాపం తెలిపారు. బాలకృష్ణ పార్టీ ప్రజాసంఘాల ఉద్యమంలో చురుగ్గా పాల్గొనడంతో పాటు పార్టీ శ్రేణులను ప్రజాసంఘాల శ్రేణులను ఆప్యాయంగా పలకరించి స్నేహపూర్వకంగా ఉండే వారిని అన్నారు. ఆయన మృతికి రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బాలిన రమణారావు, నల్లమోతుల అప్పన్న, కోతాటి వెంకటేశ్వరరావు, వానరాశి రాంబాబు, వీరమల్ల జయరాజు, మేనుగుల దుర్గారావు, నల్లమోతుల అప్పన్న, తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

చింతలపూడి: సీపీఐ చింతలపూడి మండల కార్యదర్శి తుర్లపాటిబాబు మాట్లాడుతూ బాలకష్ణ మృతి సిపిఐ, ప్రజా సంఘాలకు తీరని లోటన్నారు. ఆయన మృతికి సంతాపాన్ని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఐ సీనియర్ నాయకులు మామిళ్ళపల్లి వసంతరావు, మండల కార్యదర్శి తొర్లపాటి బాబు, సహాయ కార్యదర్శి దొంత కృష్ణ, మండల కమిటీ సభ్యులు బోడ వజ్రం, కంచర్ల గురవయ్య, పుల్లారి సోమశేఖర్, జంగా రామచంద్రారెడ్డి, ఎస్కే కాలేషా, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ తోర్లపాటి రాజు ఉన్నారు.

కుక్కునూరు: బాలకృష్ణ మృతికి సీపీఐ కుక్కునూరు మండల కమిటీ ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపింది. బాలకృష్ణ పార్టీ అభివృద్ధికి కృషి చేశారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. సీపీఐ కుక్కునూరు మండల సమితి కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య,ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల,జిల్లా సమితి సభ్యులు అయితా సురేష్ బాబు, బాబూరావు, పాపారావు,నాగేష్, సోమరాజు,రమేష్, ఉంగ,నవీన్ తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ బాలకృష్ణ ఇకలేరు

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం: సీనియర్ జర్నలిస్టు, సీపీఐజిల్లా సమితి నాయకులు పెదసనగంటి బాలకృష్ణ సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. గుండెపోటు రావడంతో పార్టీ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. జంగారెడ్డిగూడెం డివిజన్ పాత్రికేయుడుగా గత రెండు దశాబ్దాలకు పైగా వివిధ పత్రికలు, చానల్స్ లో పనిచేశారు. అదే సమయంలో కమ్యూనిస్టు భావజాలం కలిగిన బాలకృష్ణ భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం పొంది పార్టీలో పని చేస్తూ అంచలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం సీపీఐ జిల్లా సమితి సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు సోదరులు ఉన్నారు. బాలకృష్ణ జంగారెడ్డి పట్టణంలో సుపరిచితుడు కావడంతో ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే పట్నంలోని పలువురు ప్రముఖులు, స్నేహితులు బంధువులు అధిక సంఖ్యలో వచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

డిపిఆర్‌టియు జిల్లా కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

విశాలాంధ్ర- ఏలూరు: డెమొక్రటిక్ పి ఆర్ టి యు (డి పి ఆర్ టి యు) జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తలపంటి శ్రీనివాసరావు, శేషపు శ్రీనివాసు ఎన్నికయ్యారు. స్థానిక ఎస్ ఆర్ పేటలోని డి పి ఆర్ టి యు కార్యాల యంలో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా శాఖ కోశాధికారిగా ఎస్ విికె వీరబాబు, జిల్లా కేంద్ర అధ్యక్షులుగా రెడ్డి నాగ వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తిరుపతి సందీప్, రాష్ట్ర కార్యదర్శిగా కొత్తపల్లి సూర్యచంద్రరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆర్ నాగేంద్ర సింగ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా గుంపిన గోపి కిషోర్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తలపంటి శ్రీనివాసరావు, శేషపు శ్రీనివాసు ఈసందర్భంగా మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం తరపున కృషి చేస్తామన్నారు. డిపిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. శ్రీను, పి. వెంకటేశ్వరరావు, రాష్ట్ర గౌరవ సలహాదారు అచ్యుతరావులు ఎన్నికలను పర్యవేక్షించారు.





ధాన్యం కొనుగోలులో అక్రమాలు జరిగాయన్న రైతు ఆరోపణతో అధికారులు దర్యాప్తు



విశాలాంధ్ర-లింగపాలెం: ధాన్యం కొనుగోలుపై యడవల్లికి చెందిన సెట్టి శ్రీనివాస్ చేసిన ఫిర్యాదుపై జిల్లా అధికారులు దర్యాప్తు చేపట్టారు.శ్రీనివాస్ అనే రైతు ఈయనకు చెందిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రం ఆమోదంతో రంగాపురంలోని ధాన్యం కొనుగోలు మిల్లుకు తరలించాడు.మిల్లరు ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉందని దీన్ని తీసుకోవడం సాధ్యపడదని చెప్పాడంటూ రైతు ఆరోపించాడు.రైతు తెచ్చిన ధాన్యాన్ని తీసుకోవడానికి కొంత సొమ్ము మిల్లు యజమాని అడిగాడని రైతు పేర్కొన్నాడు.దీనిపై రైతు అధికారులకు ఫిర్యాదు చేయటంతో అధికారులు దర్యాప్తు చేపట్టారు.జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ భాషా, సివిల్ సప్లై డిఎస్ఓ శివరామమూర్తి, లింగపాలెం తహసిల్దార్ నజీముల్లాషా స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు యడవల్లి, రంగాపురంలో దీనికి సంబంధించి విచారణ చేశారు. విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాలను కలెక్టర్ వెట్రి సెల్వికి పంపుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సంఘటన మండలంలో సంచలనంగా మారింది. దీనిపై అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పన్ను చెల్లించని క్రిప్టో కరెన్సీ సంస్థలపై చర్యలు : ఎంపీ మహేష్

విశాలాంధ్ర - ఏలూరు : ఆదాయపు పన్ను చట్టం కింద నిబంధనలను పాటించని ఆఫ్ షోర్ క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజిలపై చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలియజేశారు. ఈ మేరకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు లోక్ సభలో కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. మనీ లాండరింగ్ కార్యకలాపాలు, ఉగ్రవాదానికి నిధులు సమకూర్చే సంస్థల నియంత్రణకు ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ నేతృత్వంలో వర్చువల్ అసెట్స్ సర్వీస్ ప్రొవైడర్లను రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఆదాయపన్ను చట్టం 1961 సెక్షన్ 133ఏ కింద 3 క్రిప్టో ఎక్స్ఛేంజిలపై దాడులు చేయగా, నిబంధనలు పాటించని 39.8 కోట్ల విలువైన లావాదేవీలు, 125.79 కోట్ల విలువైన లెక్కల్లో చూపని ఆదాయం బయట పడ్డాయని మంత్రి సమాధానం ఇచ్చారు. ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 133ఏ కింద గత మూడేళ్లలో అనేక క్రిప్టో ఎక్స్ఛేంజి సంస్థలపై సర్వే చేపట్టగా వర్చువల్ డిజిటల్ ఆస్తులకు చెందిన లెక్కల్లో చూపని 888.82 కోట్ల ఆదాయం బయటపడిందని వెల్లడించారు. క్రిప్టో సంస్థల నుంచి వసూలు చేసిన పన్నులకు సంబంధించి రాష్ట్రాల వారీగా వివరాలు కోరుతూ ఎంపీ మహేష్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇస్తూ క్రిప్టో ఎక్స్ఛేంజిల నుంచి 2024- 25 ఏడాదికి వసూలు చేసిన ఆదాయపన్ను లెక్కల ప్రకారం 293.40 కోట్లతో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉండగా,133.94 కోట్లతో గుజరాత్ రెండో స్థానంలో ఉందని తెలిపారు. క్రిప్టో ఎక్స్ఛేంజిలు తక్కువగా ఉన్న ఆంధ్రప్రదేశ్ 12 లక్షల పన్ను వసూళ్లతో 10వ స్థానంలో ఉన్నట్లు తెలిపారు.

పనిచేసే కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

-మంత్రి రామానాయుడు

-రూ.14 కోట్లతో జరుగుతున్న దమయ్యపర్తి మురుగు డ్రైన్ పనులు పరిశీలన, వంతెనలకు శంకుస్థాపన



విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లులో రూ. 14 కోట్లతో దమయ్యపర్తి మురుగు డ్రైన్ పనులు పరుగులు పెడుతున్నాయని.. గత వైసిపి ప్రభుత్వంలో అర్ధ రూపాయి పని జరగలేదని పనిచేసే ప్రభుత్వానికి పనిచేయలేని ప్రభుత్వానికి తేడా ఇదేనని.. పనిచేసే ప్రభుత్వాన్ని, నాయకుడిని ప్రజలు ఆశీర్వదించాలని రాష్ట్ర జలవనుర్ల శాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆయన కూటమి నాయకులతో కలిసి చురుకుగా జరుగుతున్న డ్రైన్ పనులను పరిశీలించి అదే డ్రైన్ పై రామయ్యలు ప్రాంత జి ప్లస్ వన్ కాలనీ ప్రాంతంలో 25 లక్షలు నిర్మించనున్న వంతెనకు, మరో 25 లక్షలతో వేరొక ప్రాంతంలో నిర్మిస్తున్న వంతెనకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జి ప్లస్ వన్ కాలనీవాసులు మంత్రి రామానాయుడు కలిసి మీ హయాంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మరి కొన్ని సమస్యలను వెలిబుచ్చారు. మంత్రి రామానాయుడు స్పందిస్తూ రామయ్య హాలు ప్రాంత జి ప్లస్ వన్ కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యత క్రమంలో అవసరమైన పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రితో కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు,కర్నెన గౌరునాయుడు,కర్నెన రోజారమణి,పొట్నూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర -నూజివీడు :సహకార సంఘాల ఉద్యోగస్తుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ పిఎసిఎస్ జేఏసీ ఆధ్వర్యంలో నూజివీడు కేడీసీసీ బ్యాంక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామా రావు మాట్లాడుతూ పిఏ సిఎస్ ఉద్యోగస్తులకు అనేక సంవత్సరాలుగా అమలు పరచని వేతన సవరణను అమలు పరచాలన్నారు. లాభాలతో సంబంధం లేకుండా వేతనాలను విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఇచ్చిన విధంగా ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని , గ్రాడ్యుటీ పై సీలింగ్ ఎత్తివేయాలని డిమాండ్ చేసారు. 2019లో చేపట్టిన నియామకాలకు చట్టబద్ధత కల్పించాలన్నారు. పిఏసిఎస్‌లకు తక్షణం ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను నియమించా లని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు అక్కినేని ఆంజనేయ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ గౌతమ్ నాయక్,ఇతర నాయకులు ఎన్. శ్రీనివాసరావు, ప్రభాకర్‌రావు, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

విశాలాంధ్ర -లింగపాలెం: లింగపాలెం మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేశారు. చింతలపూడి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సుబ్బారావు లింగపాలెం మండల వ్యవ సాయ శాఖ అధికారి ప్రదీప్ కుమార్ తనిఖీలలో పాల్గొ న్నారు. ధాన్యం కొనుగోలుపై కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని అధికారులు పేర్కొన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వము ధాన్యం కొనుగోలు చేపట్టిందని కొనుగోలులో ఎటువంటి అక్రమాలు జరగకుండా అధికారులు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు.రైతులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని ఎటువంటి ఇబ్బందులు జరగకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని అధికారులు అన్నారు. యడవల్లిలో ధాన్యం కొనుగోలుపై అసత్య ఆరోపణలు రావటంతో గ్రామంలోని రైతులను అధికారులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఎటువంటి ఇబ్బందులు లేవని పలువురు రైతులు ఈ సందర్భంగా అధికారులకు వివరించారు.

పేదలకు రక్షణ కల్పించాలి



విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కొండమెట్ట భూమిలో వ్యవసాయం చేసుకుంటున్న నిరుపేదలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజ నేయరాజు తహసీల్దార్ నాగరాజును కోరారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమ వారం పార్టీ నాయకులు వ్యవసాయ భూములకు రక్షణ కల్పించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయరాజు మాట్లాడుతూ మండలంలో ఎర్రంపేట గ్రామ రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 245/1,246/ 1,247/1 లలో 26.2 ఎకరాల పోరంబోకు కొండమెట్ట భూమిని ఎర్రంపేట గ్రామానికి చెందిన 46 మంది నిరుపేద ప్రజలకు 2005వ సంవత్సరంలో సీపీఐ పోరాట ఫలితంగా ప్రభుత్వం భూమి, పట్టాలు ఇచ్చినట్టు తెలిపారు. పేద ప్రజలు వారి భూమిలో వ్యవసాయం సాగు చేసుకుంటుంటే కొంతమంది సంపన్నులు అడ్డుకొని వారిని వ్యవసాయం చేసుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. పేద ప్రజలకు ఇచ్చిన భూమిలో వ్యవసాయం చేసుకోవడానికి పేద ప్రజలకు రక్షణ కల్పించాలని ఆంజనేయరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సహాయక కార్యదర్శి లక్క లక్ష్మణరావు, సీనియర్ నాయకులు దుగ్గిరాల నారాయణరావు, అల్లంపల్లి వెంకటేశ్వరరావు, తుమ్మల నాగేశ్వరరావు, పాంపర్తి సుశీల, తోట వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి : ఎంఈఓ

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందించడంలో సుచీ శుభ్రత పాటించాలని నూజివీడు మండల విద్యాశాఖ అధికారి దేవ వర ప్రసాద్ వంట ఏజెన్సీ నిర్వా హకులకు సూచించారు. సోమవారం పట్టణంలోని ఎంపీ ఎంపీ ఎస్ ఎస్ కే హెచ్ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారులు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు స్వయంగా విద్యార్థులకు ఆహారం వడ్డించారు. అనంతరం ఎంఈఓ దేవవర ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలలోనే వంటలు తయారు చేయాలని, నాణ్యమైన వంట నూనెలు, ఆహార పదార్థాలు వాడాలన్నారు. విద్యార్థులకు ప్రేమతో వడ్డించాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రధాన ఉపాధ్యాయునితోపాటు ఉపాధ్యాయులు స్వయంగా రుచి చూసి విద్యార్థులు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 జమలయ్య, ప్రధానోపాధ్యాయిని ప్రేమ సుశీల, ఉపాధ్యాయులు కొత్తపల్లి లోకరాజు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహకార సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పిఎసిఎస్ సహకార సొసైటీ సంఘాల సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో ఉన్న డిసిసిబి బ్యాంక్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షులు కెవివి సత్యనారాయణ మాట్లాడుతూ సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాల సమస్యలను పరిష్కరించాలని, వయోపరిమితి 62 సంవత్సరాలు పెంపుదల చేయాలని, 2019 - 2024 పిఆర్సి వెంటనే విడుదల చేయాలని, పిఆర్సి ఇవ్వటానికి ఆలస్యమైతే మధ్యంతర భృతి అందచేయాలని, 2019 ఉద్యోగులను పర్మినెంట్ చేసి, జీవో నెంబర్ 36ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఐదు లక్షల రూపాయలు తక్కువ కాకుండా ఆరోగ్య భీమా కల్పించి, 20 లక్షల రూపాయల టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలను చేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఈఓలు జి.తులసి ప్రసాద్, ఆర్.నాగేశ్వరరావు, కెవివి సత్యనారాయణ, ఆర్. సత్యనారాయణ రాజు రవి, నాగేశ్వరరావు, షేక్ జిలాని, బెల్లాన మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ ఉపవాస ప్రార్థనలు

విశాలాంధ్ర -లింగపాలెం: రామచంద్రపురంలోని కల్వరి జయం మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో క్రైస్తవ ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో పాస్టర్ యాకోబు క్రీస్తు సందేశాన్ని ప్రజలకు బోధించారు. ఈ సందర్భంగా క్యాలెండర్ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముళ్ళపూడి సుమన్, సురేష్,శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులను ప్రారంభించిన మంత్రి

విశాలాంధ్ర - పెరవలి : నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలంలోని కానూర- ఉసులుమర్రు సిసి రహదారి నిర్మాణ పనులను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుమారు రూ. 3 కోట్లు వ్యయంతో చేపట్టిన ఈ రహదారి, ఎన్నో ఏళ్లుగా రాకపోకల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపనుందని తెలిపారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పనులను త్వరితగతిన నాణ్యతతో పూర్తిచేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

విశాలాంధ్ర
తూర్పుగోదావరి జిల్లా

బాల్యవివాహాల నిర్మూలనకు సమాజం ముందుకు రావాలి : కలెక్టర్ కీర్తి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : బాల్యవివాహ ముక్త్ భారత్ 100 రోజుల ప్రచార కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో బాల్యవివాహాల నివారణపై సమగ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలు నవంబర్ 7 నుంచి మార్చి 8 వరకు ప్రభావవంతంగా కొనసాగుతాయని చెప్పారు. కనీస వివాహ వయస్సు అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండకుండా వివాహం జరిపితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ/వార్డ్, మండల, డివిజనల్, జిల్లా స్థాయిల్లో బాల్యవివాహ నిరోధక నిర్మూలన కమిటీలు ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, డిఆర్వో టి. సీతారామ మూర్తి, ఐసిడిఎస్ పిడిఓ టి. శ్రీదేవి, ఎస్డిసి ఎస్. భాస్కర్ రెడ్డి, పి. భాగ్యలక్ష్మి, డీ ఎల్ డబ్ల్యూవో పి. వీణా దేవి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతికి భాషే ప్రదానం

- తొలుత మాతృభాష...తర్వాతే పరాయి భాష : భారతదేశ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు
- నన్నయలో ఘనంగా ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం కార్యశాల ప్రారంభం

విశాలాంధ్ర - రాజానగరం : బండికి ఇరుసు ఎంత ముఖ్యమో భారతీయ సంస్కృతికి భాష అంతే ప్రధానమని,భాష పోతే శ్వాస పోతుందని, అందరూ మాతృ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలని భారతదేశ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో

వర్సిటీ ఉపకులపతి ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ అధ్యక్షతన రెండు రోజుల పాటు జరగనున్న భారతీయ భాషలలో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం అనే జాతీయ కార్యాశాల సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సదస్సుకు తొలిరోజు ముఖ్య అతిథిగా విచ్చేసిన పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు తొలుత నన్నయ వీసీ ప్రసన్నశ్రీ, అతిథులు, వర్సిటీ అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు మాతృభాష నేర్చుకోవాలని,ఆ తర్వాత సోదర భాషలైన హిందీ, తమిళం, మలయాళం వంటి భాషలు నేర్చుకోవాలని, పిమ్మట పర భాషలు ఎన్నైనా నేర్చుకోవచ్చని సూచించారు. విశిష్ట అతిథులుగా విచ్చేసిన తెలుగు- సంస్కృత అకాడమి అధ్యక్షులు ఆర్.డి.విల్సన్(శరత్ చంద్ర), తానా పూర్వాధ్యక్షులు డాక్టర్ తోటకూర ప్రసాద్,భారతీయ భాషా సమితి అకడమిక్స్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.గిరిధ రరావు ప్రసంగించారు. పలువురు రచయితలు రచించిన మూడు పుస్తకాలను వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. అనంతరం వర్సిటీ విసి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ చేతులమీదుగా వెంకయ్య నాయుడుని సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, వర్సిటీ అధికారులు డాక్టర్ కెవిఎన్డి వరప్రసాద్,సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ తలారి వాసు,వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

స్టార్టప్ ఐడియాలకు వేదిక రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

కలెక్టర్ కీర్తి చేకూరి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : సోమవారం బొమ్మూరులోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో ఈ నెల 9 నుండి 11వ తేదీ వరకు "స్పార్క్" పేరిట స్టార్టప్ ఐడియాలు ఉన్న ఔత్సాహిక వ్యాపారవేత్తల కోసం మూడు రోజుల ప్రోగ్రామ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ ప్రోగ్రామ్‌ను ప్రారంభ దశ ఫౌండర్లు, ఇన్నోవేటర్లు, విద్యార్థులు, స్టార్టప్‌లపై ఆసక్తి ఉన్నవారిని దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ మూడు రోజుల ప్రోగ్రామ్‌లో మొదటి రోజు బొమ్మూరు లోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లో, రెండవ రోజు గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, రాజమహేంద్రవరం లో, మూడవ రోజు ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో నిర్వహించబడుతుందని ఆర్టీఐహెచ్ డైరెక్టర్ జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ తెలిపారు. ఈ ప్రోగ్రామ్‌కు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ రాజమహేంద్రవరం డైరెక్టర్ జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్ , నోడల్ ఆఫీసర్ సూర్య ప్రకాష్ తో పాటు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్.పి ఆధ్వర్యంలో పిజిఆర్ఎస్

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం", (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని సోమవారం జిల్లా పోలీస్ కార్యాల యంలో జిల్లా ఎస్.పి. డి. నరసింహ కిషోర్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించి వారి కష్టాలను, బాధలను స్వయంగా అడిగి తెలుసుకుని, వెనువెంటనే నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాదిదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయవలసిందిగా ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం నాటి పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం" కార్యక్రమానికి 32 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యలు, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులతో పాటు ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించారు.

ప్రభుత్వ సర్వేలను సత్వరమే పూర్తి చేయాలి

విశాలాంధ్ర - సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం సర్వేలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఎంపిడిఓ ఎం. భారతి అన్నారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆమె ఆధ్వర్యంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ప్రకాష్, ఏఓ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వివిధ సర్వేలను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పి ఓన్ 4 యాప్ ద్వారా గ్రామాల్లో ఉన్న ప్రైవేటు ఆర్ఓ ప్లాంటులు, ఖాళీ స్థలాలు, వంటి వాటి వివరాలను ఆన్లైన్ చేయాలని ఆదేశించారు. హౌసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ అసిస్టెంట్లు సతీష్, అన్ని గ్రామాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

"ధరణీ పుత్రులు" పుస్తక ఆవిష్కరణ

విశాలాంధ్ర - కడియం : శాస్త్రవేత్త, వృక్షశాస్త్రంలో మహాదిట్ట, ఎటువంటి పరిశోధనలు చేయకుండానే ఎన్నో రకాల మొక్కలను నర్సరీ రంగానికి అందించిన వనమాలి, కడియపులంక శ్రీ సత్యదేవా నర్సరీ అధినేత దివంగత పుల్లా నాగేశ్వరరావు ఆయన తండ్రి శ్రీ సత్యదేవా నర్సరీ వ్యవస్థాపకులు దివంగత పుల్లా వెంకట్రావు జీవిత చరిత్రలను "ధరణి పుత్రులు" పేరిట రచించిన పుస్తకాన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నందు జరుగుతున్న ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన వెంకయ్య నాయుడు పలువురు ఉన్నతాధికారులు సత్యదేవ కుటుంబ సభ్యులు సమక్షంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు.

రైతు సమస్యలు, వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై సీపీఐ నిరసన

- డిసెంబర్ 26 న జరిగే సీపీఐ శత వార్షికోత్సవాలను విజయవంతం చేయండి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు

విశాలాంధ్ర-రాజమండ్రి : ఈ నెల 10 న రైతు సమస్యలు, ఈ నెల 18న వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై సీపీఐ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమాలలో పార్టీ శ్రేణులు, రైతులు, విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ తాటిపాక మధు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక అపరాల సెక్షన్ కార్యాలయం లో శాఖ సమావేశం హరినాథ్ అధ్యక్షతన జరిగింది . ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తాటిపాక మధు మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని మార్కెట్ యార్డుల వద్ద నిరసనలు, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా ఈ నెల 18న భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్ని కల ముందు రైతులకు ఇచ్చిన హామీలను చంద్రబాబు నాయుడు తుంగలో తొక్కారని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక విలవిలలాడిపోతున్నారని అన్నారు. వ్యవసాయం దండగ అని గతంలో చేసిన చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు నిజం చేస్తున్నారని మండిపడ్డారు. రైతాంగం కంట తడిపెట్టిన ఏ రాష్ట్రం కానీ, ఏ దేశం కానీ ప్రపంచంలో బాగుపడిన దాఖలాలు లేవని, గత వైసీపీ ప్రభుత్వం రైతాంగాన్ని విస్మరించిన కారణంగానే అధికారానికి దూరంగా పెట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇళ్లు లేని పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇస్తామని హామీని చంద్రబాబు విస్మరించారని అన్నారు. పేదలకు ఇళ్ళ స్థలాలు ఇచ్చే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. ఈ నెల 26వ తేదీకి సీపీఐ 100 సంవత్సరాలు పూర్తిచేసుకొని 101 సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా గ్రామాల్లో, పట్టణాల్లో వార్డులో సీపీఐ పతాకాలను ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె. రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పీపీపీ పేరుతో ప్రైవేట్, కార్పొరేట్ వ్యక్తులకు అప్పజెప్పే ఆలోచనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పేద, దళిత, మైనార్టీ విద్యార్థులను ఎంబీబీఎస్ విద్యకు దూరం చేయడానికే కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 107, 108 జీవోలు తీసుకువస్తే నానా గగ్గోలు పెట్టి యువగళం పాదయాత్రలో ఆ జీవోలను రద్దు చేస్తామని, పేద విద్యార్థులకు వైద్య విద్యను ఉచితంగా అందజేస్తామని హామీ ఇచ్చిన నారా లోకేష్ నేడు వైద్య విద్యను పూర్తిగా ప్రైవేటీకరణ చేస్తున్నారని మండిపడ్డారు. మెడికల్ కాలేజీల వద్ద జరిగే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాంబాబు కోరారు ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి వి. కొండలరావు, సహాయ కార్యదర్శి, జట్ల సంఘం కార్యదర్శి సప్ప రమణ, అపరాల సెక్షన్ వేణు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో 213 అర్జీలు స్వీకరణ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 213 అర్జీలు స్వీకరించినట్టు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. రెవెన్యూ, సర్వే సంబంధిత అర్జీలు అత్యధికంగా వచ్చాయని పేర్కొన్నారు. ప్రజలు క్షేత్ర స్థాయిలో అర్జీలు సమర్పించేందుకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. గ్రీవెన్స్‌లో అందిన అర్జీలను శాఖాధిపతులు పర్యవేక్షణ లో పెండింగ్ లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ విషయంలో రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దృష్టి సారించారు. తేమ శాతం పేరిట రైతులకు నష్టం కలగకుండా పరిశీలించాలని సూచించారు. యూరియా సరఫరా పుష్కలంగా అందుబాటులో ఉన్నందున రైతులకు సరైన సమాచారం ఇవ్వాలని రైతు సంక్షేమంపై అధికారులు చురుకుగా వ్యవహరించాలని సూచించారు. భూసంబంధిత సమస్యలు, రేషన్ సరఫరా, రోడ్లు, శానిటేషన్ వంటి అంశాలపై ప్రజలు ఎక్కువగా ఫిర్యాదులు చేశారని, ఆయా శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, డిఆర్వో టీ. సీతారామ మూర్తి, ఎస్డిసి ఎస్. భాస్కర్ రెడ్డి, పి. భాగ్యలక్ష్మి, సీపీవో జాయింట్ డైరెక్టర్ ఎల్. అప్పల కొండ, డీఎస్పీ విద్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షులుగా లక్ష్మణరావు



విశాలాంధ్ర - కడియం : కడియం మండలం, వీరవరం ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎం. లక్ష్మణరావు తూర్పుగోదావరి జిల్లా ఎస్టీయూ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ, గైట్‌లో జరిగిన రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 79 వ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశంలో లక్ష్మణరావు ను జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, 12వ పిఆర్సి కమీషన్ ను వెంటనే నియమించాలని, వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేసారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

పౌర విమానయాన శాఖా మంత్రి ఉన్నాడా?

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : ప్రపంచలోనే అత్యధిక జనాభా కలిగిన ఈ దేశం లో గత కొన్ని రోజులుగా జరుగుతున్న ఇండిగో విమానయాన సంస్థ అంతరంగిక సమస్యల వలన కొన్ని వేల మంది ప్రయాణికులు ఇక్కట్లు పాలవుతున్నారని, విమానయాన శాఖా మంత్రిగా రామ్మోహన్ నాయుడు ఉండడం ఈ దేశ ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యమని వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ విమర్శించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అసలు ఇప్పటి వరకు విమానయాన శాఖకు ఇంతటి చెత్త మంత్రి లేడంటే అతిశయోక్తి కాదన్నారు. విచిత్రం ఏమిటంటే నారా లోకేష్ ఈ సమస్య ను పర్యవేక్షిస్తున్నారని చెప్పడం మరీ విడ్డూరమని, అసలు నారా లోకేష్ ఎవరని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయడం కోసం విస్తృత ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. టీడీపీ పాలకులు ఇప్పటికైనా మేలుకుని ప్రజలను వారి బాగోగులను పట్టించుకోవాలని, వారి ఆరోగ్యం మీద శ్రద్ధ వహించాలని భరత్ హితవు పలికారు.

కొండవీటి విద్యాసంస్థల ఆర్థిక సహాయం

శ్రీనివాసరావు గుండె వైద్యం నిమిత్తం రూ. 50 వేలు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - గోపాలపురం : ఆపదలో ఉన్న వారిని ఆర్థికంగా ఆదుకోవడమే సగటు మనిషి కర్తవ్యం అని కొండవీటి విద్యాసంస్థల కరస్పాండెంట్ కెఎస్‌డి ఆశీర్వాదం అన్నారు. సోమవారం స్థానిక కొండవీటి డిగ్రీ కళాశాల, శ్రీ గౌతమి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ఆశీర్వాదం మాట్లాడుతూ గోపాలపురంలోని వేల చింతల గూడెం గ్రామానికి చెందిన కొయ్య శ్రీనివాసరావు దేవరపల్లిలో గల జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఇంగ్లీష్ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఆయన గుండె సంబంధమైన సమస్యతో ఆసుపత్రిలో చేరి హైదరాబాదులో వైద్యుల సూచన మేరకు గుండె మార్పిడి అనివార్యమని చెప్పడంతో ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్న ఆయనకు దాతలు తమ వంతు సహకారం అందిస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే తమ కళాశాల నుండి విద్యార్థులు,ఉపాధ్యాయ సిబ్బంది సహకారంతో 50 వేల రూపాయలు సొమ్మును కొయ్య శ్రీనివాసరావు భార్య సుమన్ విద్య అకౌంట్లో జమ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతియుత సమాజ స్థాపనకు కృషి చేద్దాం

మంత్రి కందుల దుర్గేష్

విశాలాంధ్ర- నిడదవోలు : ప్రేమ, కరుణకు ప్రతీకగా నిలిచిన ఏసు క్రీస్తు ప్రబోధించిన శాంతియుత సమ సమాజ స్థాపనకు కులమతాలకు అతీతంగా కృషి చేద్దామని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెం బేతెస్థలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా దైవజనులు మంత్రి దుర్గేష్‌ను ఆశీర్వదించారు. కందుల దుర్గేష్ మాట్లాడుతూ ప్రపంచమానవాళికి శాంతియుతమైన, ప్రేమపూర్వకమైన జీవనమార్గాన్ని ఉపదేశించి సమాజాన్ని సంస్కరించిన యుగకర్త ఏసు ప్రభువు అని కొనియాడారు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ అనే పదాలను ఉదహరిస్తూ దుష్టులను శిక్షించాలని,

శిష్టులను రక్షించాలని అంటారు కానీ తనను హింసించి శిలువ వేసిన దుష్టులను సైతం క్షమించమని చెప్పిన మహానుభావుడు ఏసుప్రభువని దుర్గేష్ అన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఉప్పులూరి రామ్మోహన్ రావు, మాజీ సర్పంచ్ ఎండి అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర - రాజానగరం : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించి మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు రుడా ఛైర్మన్, నియోజకవర్గ టీడీపీ అధ్యక్షులు బొడ్డు వెంకట రమణ చౌదరి చేతులు మీదుగా పలువురు లబ్ధిదారులకు సోమవారం చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని వివిధ అనారోగ్య కారణాలతో చికిత్స పొందిన వివిధ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. మండలంలోని ముక్కినాడ,శ్రీరామపురం, గ్రామాలతో పాటు నియోజకవర్గంలోని బుచ్చింపేట,శ్రీరంగపట్నం తదితర గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సంబంధించి చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా రుడా ఛైర్మన్ మాట్లాడుతూ వివిధ అనారోగ్య కారణాలతో చికిత్సల అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల కోసం సిఫారసు మేరకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వంక మల్లిఖార్జున స్వామి(మల్లిబాబు),నాయకులు సంగీత సత్తిబాబు, టీడీపీ నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘ ఉద్యోగస్తుల సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి దుర్గేష్

విశాలాంధ్ర - నిడదవోలు : రాష్ట్ర సహకార సంఘ ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.ఏపీ రాష్ట్ర సహకార ఉద్యోగుల సంఘం జేఏసీ పిలుపు మేరకు డిసిసిబి నిడదవోలు బ్రాంచ్ వద్ద నల్ల బ్యాడ్జిలు ధరించి నిడదవోలు సహకార సంఘ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ధర్నాను సంఘం గౌరవ అధ్యక్షులు జువ్వల రాంబాబు ప్రారంభించి మద్దతు తెలిపారు. రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ శ్రీ కోట సత్తెమ్మను దర్శించుకుని తిరిగి వస్తూ ఉద్యోగుల శిబిరం వద్ద ఆగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని దుర్గేష్ కి అందజేసి సమస్యలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు డిఎస్ఎన్. మూర్తి కే. శ్రీనివాస్, కేతనపల్లి శ్రీనివాస్, డి. సూర్య చంద్ర రావు, పెండ్యాల వరలక్ష్మి, పి. ప్రకాశ రావు, కే. సుబ్బారావు, పి. సురేంద్ర బాబు, ఎ. శ్రీ కాంత్, సహకార సంఘ సెక్రటరీలు పాల్గొన్నారు.

సహకార సంఘ ఉద్యోగులు నిరసన

విశాలాంధ్ర - తాళ్లపూడి: తమ దీరకాలిక డిమాండ్ల పరిష్కారానికి సహకార సంఘాల ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మండల కేంద్ర మైన తాళ్లపూడి డి.సి.సీ.బీ బ్రాంచ్ వద్ద పోలవరం, తాళ్లపూడి మండలాల్లోని

సహకార సంఘాల సిబ్బంది తమ విధులను నిలిపివేసి డిసిసిబి కార్యాలయాన్ని మూయించి వేశారు. సంఘ అధ్యక్షులు బొర్రా రామచంద్రం మాట్లాడుతూ, జి.ఓ నెం.36 ను తక్షణం అమలులోకి తేవాలని, ప్రతి ఐదేళ్లకు వేతన సవరణ జరగాలని, పెండింగ్ వేతన సవరణ చర్యలు తీసు కోవాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 కి పెంచాలని డిమాండ్ చేశారు. పోలవరం, కృష్ణారావు పేట, అన్న దేవరపేట, రాగోలపల్లి, గూటాల తాడిపూడి, పాత పట్టిసం, కొత్త పట్టిసం గ్రామాల సహకార సంఘాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తాం

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని స్పెషల్ ఆఫీసర్, ఆర్ఎంసి కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. కోలమూరు పంచాయతీలో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలు లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పంచాయతీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, త్వరలోనే నూతన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బందితో ముఖాముఖి మాట్లాడారు. ఏదైనా సమస్యతో సచివాలయానికి వచ్చేవారు ఎవరూ కూడా నిరుత్సాహంతో వెనుదిరిగే పరిస్థితి ఉండకూడదన్నారు. అలాగే నిలిచిపోయిన సచివాలయ భవన నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

డిసెంబర్ 9 లోపు పదవ తరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : జిల్లాలో 10వ తరగతి విద్యార్థులు పరీక్ష ఫీజులు చెల్లించవలసిన తేదీలను జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ప్రకటించారు.మార్చి 2026 లో జరుగబోవు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు రెగ్యులర్ /నూతన విధానంలో అనగా మార్చి 2025లో పరీక్షలకు హాజరై ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ఈ విద్యా సంవత్సరము 2025-26 ప్రభుత్వ గుర్తింపు గల ఉన్నత పాఠశాలల నుండి పరీక్ష రుసుమును చెల్లించుటకు సవరించిన ఆఖరు తేదీలు ప్రకటించారు. ఆలస్య రుసుము లేకుండా ఈనెల 12వతేదీ, రూ. 50 ఆలస్య రుసుముతో ఈనెల 10 నుంచి 12 వరకు, రూ. 200 రుసుముతో ఈనెల 13 నుంచి15 వరకు రూ. 2500 ఆలస్య రుసుమతో ఈనెల 16వతేదీ నుంచి 18వతేదీలోగా చెల్లించవచ్చు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు రూ. 125, మూడు లేదా అంతకంటే తక్కువ సబ్జెక్టులకు రు. 110, మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులుంటే రూ. 125, వృత్తి విద్యా విద్యార్థులు సాధారణ పరీక్ష రుసుము రు.125, అదనంగా రూ.60 చెల్లించాలి.

ఐడీ కార్డులు అందజేత

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం లక్ష్మీపురం గ్రామంలో హై స్కూల్ మరియు ఎలి మెంటరీ స్కూల్ విద్యార్థులకు హ్యూమన్ రైట్స్ గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్ మరియు ఎ ఎన్ ఎస్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని స్కూల్ విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఐడి కార్డ్స్ అందజేశారు. ఈ సందర్భంగా గోపాలపురం నియోజవర్గ హ్యూమన్ రైట్స్ కన్వీనర్ పోలిమాటి నాని మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఐడి కార్డులు అందజేసినట్లు తెలిపారు విద్యార్థులు విద్యలో మంచి మార్కులు సాధించాలని ఆయన కోరారు .

ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా సత్య సాయిరామ్

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా తూర్పుగోదావరి జిల్లా నుండి కాలెపు సత్య సాయిరామ్‌ను రాష్ట్ర పార్టీ నియమించింది. మోర్చా రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ ఆదివారం రాష్ట్ర కమిటీ ప్రకటించారు. ఈ కమిటీ లో తూర్పుగోదావరి జిల్లా నుండి రాజమండ్రికి చెందిన కాలెపు సత్య సాయిరామ్ ను రాష్ట్ర ఉపాధ్యక్షుడు గా నియమించారు. కాలెపు సత్య సాయిరామ్ గతంలో జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షుడుగా , బీజేపీ జిల్లా కార్యదర్శి గా ప్రస్తుతం ఓబీసీ మోర్చా తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడుగా ఐదు సంవత్సరాలుగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన నియామకంపట్ల బీజేపీ నాయకులు , ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమిదే విజయం

విశాలాంధ్ర-కొవ్వూరు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి పార్టీ ఘనవిజయం సాధిస్తుందని కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ టీవీ రామారావు అన్నారు. ఆయన విశాలాంధ్ర ప్రతినిధితో మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికలు, పంచాయతీలు జడ్పీటీసిల ఎన్నికల కోసం ఇప్పటికే క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, నాయకులతో మాట్లాడి కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. నియోజకవర్గంలో ఒక ఎంపీపీ స్థానాన్ని, జెడ్పీటీసీ స్థానాన్ని తమ పార్టీ అడుగుతుందని పేర్కొన్నారు. తమ పార్టీ అధినాయకుడు పవన్ కళ్యాణ్ ప్రత్యేకించి పంచాయతీ రాజ్‌శాఖలో ఎన్నో సమూలమైన మార్పులు తీసుకొచ్చారని అన్నారు. కార్యకర్తలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా తాను ముందు ఉంటానని స్పష్టం చేశారు.

మీకోసం అర్జీదారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు : ఆర్డీవో రాణి సుస్మిత

విశాలాంధ్ర - కొవ్వూరు : మీకోసం అర్జీదారులు meekosam. ap.gov.in వెబ్‌సైట్ ద్వారా సులభంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవ చ్చని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన "పీజీఆర్ఎస్- మీ కోసం" కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆర్డీవో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా 18 అర్జీలు స్వీకరించామని తెలిపారు. ప్రజలు 1100 మీకోసం కాల్ సెంటర్ ద్వారా కూడా తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చన్నారు. వారానికి రెండు సార్లు సంబంధిత శాఖల జిల్లా , డివిజన్ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి అర్జీల పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకుంటా మని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కెఆర్‌సి, తహసీల్దార్ పి. అచ్యుత కుమారి, వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మంచినీటి బోరును ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పెదపూడి : అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం చంద్రేడులో రూ.7 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మంచి నీటిబోర్‌ను ఎమ్మెల్యే నల్లమిల్లి రామ కృష్ణా రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గోదావరి కాకినాడ జిల్లా

అణగారిన వర్గాలపై పెచ్చుమీరుతున్న దాడులు

విశాలాంధ్ర - పెదపూడి : ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారం చేపట్టిన తరువాత బడుగు బలహీన వర్గాలకు సంబంధించిన చేయూత ఫీజు రీయంబర్స్మెంట్ రైతులకు ఉచిత పంటల భీమా వంటి సంక్షేమ పథకాలు నిలిపివేసిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి విమ ర్శించారు. రాజుపాలెం లంక సత్య కల్యాణ మండ పంలో సుందరపల్లి రామారావు మండల ఎస్సీ సెల్ అధ్యక్షునిగా నియమితులైన సందర్భంగా వైసిపి రాజమహేంద్రవరం సిటీ, గోపాలపురం నియోజక వర్గ పరిశీలకులు అద్దంకి ముక్తేశ్వరరావు అధ్యక్షతన జరిగిన అభినందన సభకు మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్య నారాయణ రెడ్డి ఆదిలక్ష్మి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ అనపర్తి నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలపై దాడులు పెరిగాయని దోమాడ రోడ్డు, కుతుకులూరులో నిరుపేదలైన ఎస్సీలను లక్ష్యంగా చేసుకుని ఇల్లు కూల్చి వేయడం పట్ల ఎమ్మెల్యే నల్లమిల్లి రామక ృష్ణ?రెడ్డి పై ఆగ్రహం వ్యక్తంచేశారు. కష్టపడి పనిచేసే పార్టీలోని ప్రతి నేత, కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వడం జరుగుతుందని, అంతే కాకుండా అధికార పార్టీ దౌర్జన్యాలకు పార్టీ శ్రేణులు ఎవరు భయపడవలసిన అవసరం లేదని మాజీ ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనపర్తి, పెదపూడి, బిక్కవోలు మండల పార్టీ కన్వీనర్లు సత్తి రామకృష్ణారెడ్డి, రమణ, పోతుల ప్రసాద్ రెడ్డి ఇంకా పలువురు నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రబీ నీటి లభ్యతపై డెల్టా ఛైర్మన్ మురాలశెట్టి ఆరా

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : రబీ ఆకుమడులకు నీటి లభ్యతపై సోమవారం తూర్పు డెల్టా చైర్మన్ మురాల శెట్టి సునీల్ కుమార్ మండలంలో పలువురు రైతులను కలిశారు. పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ, ఎండపల్లి గ్రామాలలో రబీ పంటకు ఆకుమడులు సిద్ధం చేసు కుంటున్న రైతులను కలిసి నీటి లభ్యత తెలుసుకుని, వంతులవారి నీటి వినియోగంలో పలు సూచనలు అందిచారు. నీటి సరఫరా పెంచాలని మదపురం, కొత్తపల్లి, కొమరగిరి గ్రామల రైతులు తెలియచేయగా సంభందిత నీటి సంగం అధ్యక్షులతో చర్చించి, నీటి ఎద్దడి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. చిత్రాడ నీటిసంగం అధ్యక్షులు బసవ సత్తిబాబు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్, చిత్రాడ జనసేన నాయకులు దేసినీడి సతీష్, ఎండపల్లి నీటిసంగం మెంబర్లు జనసేన నాయకులు గుండ్ర జగ్గారావు, మత్సా శ్రీనివాసరావు, గుండ్ర కిశోర్, గుండ్ర బాబ్జి, రైతులు పాల్గున్నారు. రైతులు నీటి అవసరాలకు పిఠాపురం డెల్టా చైర్మన్ కార్యాలయం నెంబర్‌కు 95 15 36 62 62 ఏ సమయంలో అయినా సంప్రదించవచ్చు అని ఆయన తెలిపారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

అధికారులకు అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ ఆదేశాలు

విశాలాంధ్ర - కాకినాడ : పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన ప్రజా అర్జీలను వేగవంతంగా పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ కెటి సుధాకర్ ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (గ్రా+=గా) కార్యక్రమం ఈ సోమవారం కూడా నగర పాలక సంస్థ కార్యాలయంలో యథావిధిగా జరిగింది. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ కెటి సుధాకర్ స్వయంగా ప్రజల నుండి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్యలు, వీధిలైట్లు, అక్రమ నిర్మాణాల తొలగింపు వంటి వివిధ అంశాలపై ప్రజలు తమ సమస్యలను తెలియజేశారు. మొత్తం 11 అర్జీలు అందగా, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత విభాగాధికారులకు అదనపు కమిషనర్ సూచించారు. అంతకుముందు నిర్వహించిన "డయల్ యువర్ కమిషనర్" కార్యక్రమంలో ఇద్దరు పౌరులు ఫోన్ ద్వారా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, ఎసిపి కృష్ణారావు, టిపిఆర్వో శైలజ, మేనేజర్ సీతారాం తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆదిత్య కళాశాలలో అటల్ ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం, డిసెంబర్ ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) సౌజన్యంతో నిర్వహిస్తున్న అటల్ ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఆఫ్ లైన్ శిక్షణ కార్యక్రమం 6+ వైర్‌లెస్ కమ్యూనికేషన్స్ కోసం బహుళ క్యారియర్ మాడ్యులేషన్ టెక్నిక్‌లు"అనే అంశంపై డిసెంబర్ 8 నుంచి 13 వరకు కొనసాగుతుందని ప్రో వైస్ చాన్సలర్ (ఇంజినీరింగ్ ఒ సైన్స్) డా పి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ విద్యాసంస్థలు, ఎన్ఐటి, ఐఐఐటి, విశ్వ విద్యాలయాల ప్రొఫెసర్లు మరియు పారిశ్రామిక నిపుణులు వక్తలుగా వ్యవహరించనున్నారు. ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డా ఎమ్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, 6+ విభాగంలో పరిశోధనకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతుంది అని అధ్యాపకులు, పరిశోధకులు దీన్ని ఉపయోగించుకోవాలి" అని తెలిపారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డా ఆర్‌వివి కృష్ణ మాట్లాడుతూ, 6+ టెక్నాలజీ రాబోయే దశాబ్దంలో ప్రపంచాన్ని మార్చే కీలక పరిశోధన రంగం. అధ్యాపకులు మరియు పరిశోధకులు ఇందులో కొత్త అంశాలను అన్వేషించడానికి ఈ ప్రోగ్రామ్ ఎంతో ఉపయోగపడుతుంది" అని పేర్కొన్నారు. డీన్ అడ్మినిస్ట్రేషన్ డా వైకెఎస్ సుబ్బారావు, డీన్ అకాడమిక్ డా పిఎస్‌విఎస్ రవికుమార్, ప్రోగ్రామ్ కో కోఆర్డినేటర్ డా ఆర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ, "ఆదిత్యా సంస్థలో జాతీయ స్థాయి ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించడం గర్వకారణం. నూతన సాంకేతికతపై అధ్యాపకులు అవగాహన పెంపొందించుకునేందుకు ఇది అద్భుత వేదిక" అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి అనేకమంది అధ్యాపకులు పాల్గొంటున్నారు. నిపుణులు, అతిథి వక్తలు ప్రతిరోజూ లెక్చర్లు, హ్యాండ్స్-ఆన్ సెషన్లు, రీసెర్చ్ ఇంటరాక్షన్‌లు నిర్వహించనున్నారు.

కెరీర్ గైడెన్స్ పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - కాకినాడ : జగన్నాథపురం మల్లాడి సత్యలింగం నాయకర్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న డిగ్రీ విద్యార్థులకు మానవ విలువలు , కెరీర్ గైడెన్స్ పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ జి ఉషారాణి అధ్యక్షత వహించారు.ఆమె మాట్లాడుతూ డిగ్రీ మొదటి సంవత్సరంలో చదువుతున్న విద్యార్థులు కెరీర్‌పై అవగాహన , మానవ విలువలు గురించి తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది అన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన డాక్టర్ మాణిక్ రెడ్డి, సత్యనారాయణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పూర్తి క్రమ శిక్షణ కలిగి టైం పంచువాలిటీ పాటిస్తూ తల్లితండ్రులపై ఆధారపడకుండా ఖాళీ సమయంలో ఏదైనా పార్ట్ టైం ఉద్యోగం చేస్తూ డబ్బు సంపాదించుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ అలపాటి శ్రీనివాస్ వివిధ అంశములపై విసరీకరించారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా వ్యవహరించిన కె రజినీ దేవి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంట్ ఆఫ్ ఆర్ట్స్ తరపున కె రజిని, డాక్టర్ బి ఏడుకొండలు, ఎస్ సుబ్బారావు, వైవి రమణ, ఫణి కుమార్ పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిధులను కళాశాల ప్రిన్సిపాల్ గౌరవ అతిధులను సత్కరించారు. పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలను అందచేశారు.

బాలుడు అదృశ్యం

విశాలాంధ్ర - గొల్లప్రోలు : మండలంలోని చేబ్రోలు గ్రామానికి చెందిన జాగు సత్యనారాయణ కుమారుడు జాగు ప్రదీప్ వయస్సు 17 సంవత్సరాలు అతను తండ్రి ఫోన్‌తో కాలక్షేపం చేస్తున్నావని మందలించటంతో ఇంటి నుండి వెళ్లిపోయాడని వచ్చిన పిర్యాదుతో ఎస్ఐ ఎన్ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేసారు. అలాగే ఎవరికైనా బాలుడు ఆచూకీ తెలిస్తే గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్ నెంబర్ 9154875379, 94409 00758లకు తెలియజేయవలసిందిగా ఒక ప్రకటనలో తెలియజేసారు.

స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ఆందోళన వద్దు

కలెక్టర్ షణ్మోహన్ సగిలి

విశాలాంధ్ర - కాకినాడ : స్క్రబ్ టైఫస్ "పురుగు" (కీటకం) కుట్టడం వల్ల వ్యాపించే వ్యాధి వల్ల ఎవరు ఆందోళన చెందవద్దని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. స్క్రబ్ టైఫస్ "పురుగు" (కీటకం) కుట్టడం వల్ల వ్యాపించే వ్యాధి పై సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్ "పురుగు" (కీటకం) కుట్టడం వల్ల వ్యాపించే వ్యాధికి ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నట్లయితే అది పూర్తిగా నయం అవుతుందని, దీనిపై ఎవరు ఆందోళన చెందవద్దని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. స్క్రబ్ టైఫస్ "పురుగు" (కీటకం) కుట్టడం గమనించినట్లయితే సమీప ఆసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని ఆయన సూచించారు. స్క్రబ్ టైఫస్ ఇది వైరస్ కాదు, ఓరింటియా సుత్సుగముషి అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది.

వ్యాప్తి : ఈ బ్యాక్టీరియా సోకిన చిన్న కీటకాలు (మైట్స్ లేదా చిగ్గర్స్) మనుషులను కుట్టడం ద్వారా వ్యాధి సంక్రమిస్తుంది. ఎలుకలు సంచరించే ప్రదేశాలలో ఉండే కీటకాలతో జాగ్రత్తగా ఉండాలి.

లక్షణాలు : తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, కీటకం కుట్టిన చోట నల్లటి మచ్చ (వంఎష్రుతీ) ఏర్పడటం ప్రధాన లక్షణం. **ప్రమాదం** : సకాలంలో గుర్తించి చికిత్స అందించకపోతే పరిస్థితి విషమించి ప్రాణాపాయం కలగవచ్చు. **చికిత్స** : సరైన సమయంలో వైద్య సహాయం అందితే యాంటీబయాటిక్ మందులతో దీనిని నయం చేయవచ్చు. తీసుకోవలసిన **జాగ్రత్తలు** : పరిశుభ్రత పాటించాలి, ముఖ్యంగా పొదలు, గడ్డి ఉన్న ప్రదేశాలలో తిరిగేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఎలుకలు ఇంట్లోకి రాకుండా నిరోధించాలి. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలి. చికిత్స కోసం స్థానిక ఆసుపత్రులు లేదా ఆరోగ్య కేంద్రాలను సంప్రదించండి. స్క్రబ్ టైఫస్ పురుగుపై వస్తున్న వదంతులు ఎవరు నమ్మవద్దని సరైన చికిత్స తీసుకుంటే త్వరితగతిన కోల్కుంటారని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. ఈ సమావేశంలో డిఎంహెచ్వో జె నరసింహ నాయక్, కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపర్డెంట్ లావణ్య కుమారి, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారం అందించాలి

విలాంధ్ర - కాకినాడ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారాల అందించాలని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో నూతన జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, ట్రైనీ కలెక్టర్ మానీషా, జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు, కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎన్ శ్రీధర్, కేఆర్ఆర్సీ ఎస్డీసీ జి రత్నమణి, సీపీవో పీ త్రినాథ్ తదితర అధికారుల కాకినాడ జిల్లా చుట్టుపక్కల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను, వినతులు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారాణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని జేసీ అపూర్వ భరత్..అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డుల లోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణలు తొలగింపు, డ్రెన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, అన్నదాత సుఖీభవ పథకం అంశాలపై మొత్తం 482 అర్జీలు అందాయి. వినతు లను సకాలంలో పరిష్కరించాలన్నారు. అర్జీదార్లు తమ అర్జీల స్థితిని తెలుసుకోవాడానికి 1100 నెంబ రుకి నేరుగా ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి హాజరు కాలేని అర్జిదారులు, తమ అర్జీలను మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్‌వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చునని భరత్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 28 నుంచి కిమ్స్‌లో ప్రపంచ తెలుగు మహాసభలు

విశాలాంధ్ర - అమలాపురం : చైతన్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో అమలాపురం కిమ్స్ ప్రాంగణంలో 3వ ప్రపంచ తెలుగు మహా సభలు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 1 వరకు నిర్వహించనున్నట్లు చైతన్య, కిమ్స్ విద్యా సంస్థల చైర్మన్ కెవివి సత్య నారాయణ రాజు తెలిపారు. కిమ్స్‌లో సో మవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహా సభలు మన తెలుగు ప్రజ లందరి పండుగగా భావించి ప్రతి ఒక్కరు ఘనంగా జరిపేందుకు తమ వంతు తోడ్పడా లని కోరారు. ఈ సభల గోడ పత్రికను నవంబరు 30వ తేదీన అనేక మంది ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, తెలుగు పండితులు, పాత్రికేయులు, తెలుగు భాషాభిమానుల సమక్షంలో ఆవిష్కరించామని తెలిపారు. గత రెండు ప్రపంచ తెలుగు మహా సభలను రాజమహేంద్రవరంలో ఘనంగా నిర్వహించామని, వాటికి తెలుగు ప్రజల నుండి వచ్చిన విశేష స్పందన, ఆదరణలతో చాలా సంతో షం కలిగిందని అన్నారు. ఈ 3వ ప్రపంచ తెలుగు మహా సభలను కూడా మరింత ఘనంగా అమలాపురం కిమ్స్ ప్రాంగణంలో నిర్వహిస్తామని చైతన్య రాజు తెలిపారు. అనేక మంది కవులు, సాహితీవేత్తలు, కళాకారులు, రాజకీయ ప్రముఖులను ఈ కార్యక్రమాలకు ఆహ్వానిస్తున్నామని, విద్యా సాహితీ సమావేశాలు జరుగుతాయని, తెలుగు భాష వికాసానికి పాటుపడిన అనేక మంది ప్రముఖ పండితులను, కళాకారులను సన్మానించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మహా సభలలో విద్యార్థులకు తెలుగు భాష ప్రావీణ్యంలో అనేక అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయడం ద్వారా చిన్నారులలో తెలుగు భాషాభిమానాన్ని పెంపొందించి భావితరాలకు తెలుగు భాష తియ్యదనాన్ని అందించి తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎం మోహన్ రాజు పాల్గొన్నారు.

సొసైటీ ఉద్యోగుల వేతనాలు చెల్లించాలని ఆందోళన

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : డిసిసిబి బ్యాంక్ వద్ద సొసైటీ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల్లోని ఒమ్మంగి, లంపకలోవ, ధర్మవరం, కిర్లంపూడి పిఎసిఎస్‌ల ఉద్యోగులు ఆందోళన కార్యక్రమంలో నిర్వహించరు. ఏపీ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఐక్యవేదిక పిలుపు మేరకు సహకార సంఘాల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాలుగు గంటల పాటు నల్ల బ్యాడ్జీలు ధరించి సొసైటీ ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. జీవో నెంబర్ 36ను వెంటనే అమలు పరిచి అమలు చేయాలని జీవో నెంబర్ 36న అమలపరిచి జీతభ త్యాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని. సామర్థ్యం నుంచి జీతాలు సంబంధం లేకుండా డిఎల్ ఎక్స్ ఆప్ ద్వారా చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఆందోళనకు డిసిసిబి బ్రాంచ్ మేనే జర్లు పీవీ కుక్కుటేశ్వరావు, పివి రమణ సూర్యం మద్దత్తు పలికారు. ఈ ఆందోళనలో సొసైటీ సీఈవోలు నిమ్మల గణేశ్వరరావు, ఒమ్మి కృష్ణమూర్తి, పసుపులేటి ఏసురత్నం, పంపన వెంకట రమణ, సొసైటీ సిబ్బంది సుంకర రామారావు, బుద్రె అప్పా రావు, అడ్డాల శ్రీను, నారాయణరావు, విజయ్, శివకుమార్, బోడ రాజు, సుంకర సురేంద్ర, బోడా శివ తదితరులు పాల్గొన్నారు.

గనిశెట్టి కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలోని ప్రత్తిపాడు గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం అయినా గనిశెట్టి తాతీలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేత, డిసిసి ఉపాధ్యక్షులు, పిసిసి మెంబర్ ధర్నాలకోట శ్రీను తాతీలు భార్య నాగమణికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీను మాటాడుతూ ప్రభుత్వం గుర్తించని నిరుపేద కుటుంబాలు చాలా ఉన్నాయని వాటన్నిటిని అధికారులు త్వరితగతిన గుర్తించి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంలో ఆయన వెంట పార్టీ శ్రేణులు కందిమల్ల శ్యామ్యూల్, అప్పన్న తదితరులు ఉన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర - కొత్తపేట : రావులపాలెం అరటి మార్కెట్ యార్డ్ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు అన్నారు. సోమవారం ఆయన మార్కెట్ యార్డును పరిశీలించి రైతులతో మాటాడి మార్కెట్ యార్డులో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ యార్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ యార్డుకు ఉత్తరం వైపున ఏఎంసి ఆధ్వర్యంలో సిసి రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. మార్కెట్ యార్డ్ బయట రావులపాలెం వెదిరేశ్వరం కాలువవైపు డ్రైనేజీ నిర్మాణం చేపడతామన్నారు. నూతనంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తామన్నారు. వే బ్రిడ్జి నిర్మాణం పనులు చేపడతామని తెలిపారు. ఆయా పనులకు సంబంధించి త్వరలోనే ప్రతిపాదనలు రూపొందిస్తామన్నారు. ఎమ్మెల్యే బండారుకు రైతులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ భవన నిర్మాణానికి కృషి

విశాలాంధ్ర - కొత్తపేట : ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రభువు విశ్వాసపాత్రులందరూ జరుపుకునే పండుగ క్రిస్మస్ అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వాడపాలెం సీడ బ్ల్యాప గ్రౌండ్‌లో జరిగిన కొత్తపేట మండల పాస్టర్స్ ఐక్య గ్లోరి యస్ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పేదప్రజల కోసం కష్ట పడుతున్న ప్రతీ ఒక్కరికీ ప్రభువు ఆశీస్సులు ఉంటాయన్నారు. పాస్టర్స్ ఫెలోషిప్ భవన నిర్మాణానికి తప్పక కృషి చేస్తానని తెలిపారు. ఆలమూరులో సైతం పాస్టర్స్ ఫెలోషిప్ భవన నిర్మాణానికి ఈ మధ్యే శంకుస్థాపన చేశారు.

టీడ్కో లబ్ధిదారులు ఆందోళన

- ఇళ్లు పాడయ్యాయని ఆవేదన

- రుణాలు రద్దు చేయాలని డిమాండు

విశాలాంధ్ర - సామర్లకోట : సుమారు పది సంవత్సరాల క్రితం నిర్మాణం చేసిన టీడ్కో గృహాలు ఇప్పటివరకు లబ్ధిదారులకు అప్పజెప్ప కుండా ఇప్పుడు పాడైపోతున్న భవనాలను ప్రైవేటు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి అప్పజెప్పేందుకు మునిసిపల్ అధికారులు ప్రయత్నిస్తున్నారని లబ్ధిదారులు సామర్లకోట మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత చంద్రబాబు ప్రభుత్వంలో లబ్ధిదారుల వద్ద నుండి, లక్ష రూపాయలు 50,000, రూపాయలు 500 రూపాయలు, కట్టించుకుని ఇల్లులు నిర్మించారని కొద్ది మందికి జాతీయ బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ఇల్లు అప్పజెప్పినప్పటికీ అప్పటికే శిథిలావస్థకు చేరుకున్నాయని ఇప్పుడు ఆ ఇల్లులు మరింత దారుణంగా అయిపోయినాయి అని స్లాబ్ నుండి లీకేజీలు వచ్చేస్తున్నాయని అటువంటి వాటిని ప్రైవేట్ బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేయవద్దని 500 రూపాయలు నిర్మించిన వాటిలాగే బ్యాంకు లోన్ లేకుండా ఇల్లులు అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధులు, తదితర నాయకులు చెప్పడంతోనే ఇళ్లల్లో నివాసం ఉంటున్నామని ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధి స్పందించి టీడ్కో ఇంటి రుణాలను రద్దు చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని లబ్ధిదారులు ఆందోళన నిర్వహించారు.

మత్స్యకారుల జీవన ఉపాధికి శిక్షణ

ఇతర రాష్ట్రాలకు బయలుదేరిన మత్స్యకారులు

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : మత్స్యకారుల జీవనోపాధికి ఇతర రాష్ట్రాలకు శిక్షణా కోసం 60 మంది మత్స్యకారులు సోమవారం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి రెండు బస్సులు ఏర్పాటు చేసి జెండా ఊపి ప్రారంభించారు. దీంతో మత్స్యకారులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ మత్స్యకారులు జీవన ఉపాధి మెరుగుపరుచుకునేందుకు మూడు రోజులపాటు శిక్షణ కోసం కేరళ, తమిళనాడు బయలుదేరి వెళ్తున్నారని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మత్స్యకారుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. తమిళనాడులో రెండు బృందాలుగా మండపం చేరుకుంటుందని అక్కడ ఉన్న సముద్రంలో నాచు పంపకం, పగడపు దిబ్బల వాటిపై వివరించడం జరుగుతుందని తెలిపారు. రెండు ప్రత్యేక బస్సుల్లో బృందానికి 30 మంది మత్స్యకారులు తరలివెళ్లి మూడు రోజులపాటు పలు అంశాలపై శిక్షణ తీసుకొని తిరిగి వస్తారు అని తెలిపారు.

అధికారులకు పిజిఆర్ఎస్ పట్టదా...!

పెరుకుపోతున్న ప్రజా సమస్యలు

విశాలాంధ్ర - కాట్రేనికోన : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పనిచేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీ ఆర్ఎస్) అపహాస్యం అవుతోంది. కాట్రేనికోన మండలంలో వివిధ శాఖల అధికారులు పిజిఆర్ఎస్ అంటేనే పట్టించు కోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సోమవారం జరగాల్సిన పిజిఆర్ఎస్ కాట్రేనికోనలో వెలవెల పోయింది. ఎంపీడీవో వెంకటాచలం, తాహసిల్దార్ రవికిరణ్ మరో అంగనవాడి సూపర్వైజర్ తప్ప మిగిలిన అధికారులు ఎవరూ హాజరు కాలేదు. వివిధ శాఖల అధికారులు ప్రతి సోమవారం పీజిఆర్ఎస్‌కు దుమ్మా కొట్టడంతో ప్రజా సమస్యలు ఎక్కడికక్కడే పెరుగుపోయి ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. అధికారులకు స్థానికంగానే ప్రజలు తమ సమస్యలు చెప్పుకుందామంటే అందుబాటులో ఉండటం లేదని, గత్యంతరం లేక జిల్లా కేంద్రమైన అమలాపురంలో జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. పోలీస్ సమస్యలు పరిష్కారం అవ్వక ఫిర్యాదుదారులు ప్రతి సోమవారం అమలాపురం ఎస్పీ గ్రీవెన్స్‌కి వెళ్ళవలసి వస్తోందని దీంతో తాము వ్యయ ప్రయాసలకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం జిల్లా గ్రీవెన్స్‌లో పెట్టుకున్న దరఖాస్తులైనా పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ, తప్పుడు ఎండార్స్మెంట్లు సమర్పించి ఫిర్యాదులు ముగించేస్తున్నారని వాపోతున్నారు. ఎంపీడీవో వెంకటాచలంను వివరణ కోరగా పిజిఆర్ఎస్‌కు స్థానిక అధికారులు గైర్హాజర్ పై ఇప్పటికే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశానని అయినా అధికారుల్లో మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ముంపు బారి నుండి రైతులను ఆదుకోవాలి

- కాట్రేనికోన రైతు సమావేశం మొర

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాట్రేనికోన మండలంలో ఇరిగేషన్ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించి రైతులను ముంపు బారి నుంచి కాపాడాలని నాయకులు ముక్త కంఠంతో కోరారు. సోమవారం కాట్రేనికోన మండల పరిషత్‌లో జరిగిన రైతుసమావేశంలో తమ సమస్యలపై ఏకరువు పెట్టారు. పంట కాలువలకు సాగునీటి సరఫరాలో వరి పంట రైతులు కన్నా ఆక్వా రైతులకే ఇరిగేషన్ అధికారులు ప్రాధాన్యనిస్తున్నారని రైతు నాయకుడు రంబాల దొరబాబు విమర్శించారు. రాష్ట్ర ఆక్వా డైరెక్టర్ విత్తనాల నాగ శ్రీనివాసరావు (బుజ్జి) మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా రైతులు మొరపెట్టుకున్నా ముంపు నివారణ పరిష్కరించలేదని, పంట కాలవల్లో లోనికి రిటైనింగ్ వాల్సు నిర్మించడం వల్ల సాగు నీరు రావడం లేదన్నారు. బాన్సుకాలువ పనులు అసంపూర్తిగా నిలిపేశారని, కోతల సమయంలో పంట కాలువలో నీరు విడుదల చేయడం వల్ల వరి పంట పనలు తడిసిపోతున్నాయని విత్తనాల ఆగ్రహం వ్యక్తం చేశారు. కాట్రేనికోన 2, కందికుప్ప, పల్లంకురు పంటకాలువ పనులు పూర్తి చేయాలని మండల సాగునీటి సంఘం అధ్యక్షులు ఆకాశం శ్రీనివాస్ కోరారు. డ్రైన్ ఏటిగట్టు పనులు చేపట్టక వేట్లపాలెం, మొండి పోర, సత్తెమ్మ చెట్టు శివారు ప్రాంతాల్లో వరి పంట ముంపు బారిన పడి రైతులు తీవ్రంగా నష్టపోవడమే కాకుండా ఈ ప్రాంతంలో కూలీ పనులు కూడా లేక స్థానికులు ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వలస పోతున్నారని రైతు నాయకుడు సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి, మాజీ రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వంరావు, ఎంపీడీవో వెంకటాచలం, తాహసిల్దార్ రవికిరణ్, ఇరిగేషన్ ఎయిఎస్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పిజీఆర్ఎస్‌లో 43 అర్జీలు

విశాలాంధ్ర - పిఠాపురం : పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయంలో పాడా పిడి శ్రీనివాసరావుకు నియోజకవర్గ ప్రజల నుండి 43 అర్జీలు అందాయి. అయితే పిడి శ్రీనివాసరావు ప్రజలను సేకరించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తూ, శారీరక దారుఢ్యం : మంత్రి సుభాష్

విశాలాంధ్ర - రామచంద్రపురం : క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు, ఉజ్వల భవిష్యత్తు పొందవచ్చని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సోమవారం రామచంద్రపురంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసనశెట్టి సుభాష్ చేతుల మీదుగా రూ.66 వేల విలువైన క్రీడా పరికరాలు అందజేశారు. కాకినాడ రోటరీ క్లబ్ చైర్మన్ తడాల వీర వెంకట సత్యనారాయణ (బుజ్జి), మహేష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమకూర్చిన ఈ క్రీడా పరిక రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ తడాల బుజ్జి, ఎంఈఓ వీర్రెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు బ్లూస్టార్ రాజా, ముమ్మిడి సత్యనారాయణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
డా॥ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

ఇంటిపన్ను చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పడండి

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో ఎంపీడీఓ సెలెట్ రాజు ఇంటింటా పర్యటించి ఇంటి పన్ను లపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పన్ను చెల్లించి గ్రామ అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ విజయ్ సాగర్, పంచాయతీ కార్యదర్శి మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - అమలాపురం రూరల్ : అనపర్తి టిటిడి కళ్యాణ మండపంలో జపాన్ షోటోకన్ ఆర్గనైజేషన్ కరాటే అకాడమీ వారు నిర్వహించిన అటల్ జిఎపి స్టేట్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలలో అమలాపురం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు కోచ్ పడాల అంజి తెలిపారు. ఈ పోటీలలో కటాస్ విభాగంలో కొత్తూరి చిన్మయ సాయి శార్వాణి, సందుల షణ్ముఖ, గుంటూరీ యువన్ కార్తీక్, అల్లూరి కుశల్ వర్మ, వెలిది కార్తికేయ ఆర్యన్ భరద్వాజ్, బసవ సాయి నందన్ బంగారు పతకాలు సాధించారు. వీరిని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ నంద్యాల మనో విహర్ అభినందించారు.

డిమాండ్ల పరిష్కరికారానికి సహకార శాఖ ఉద్యోగుల ధర్నా

విశాలాంధ్ర - మామిడికుదురు : డిమాండ్లు పరిష్కారం కోరుతూ సహకార శాఖ ఉద్యోగులు సోమ వారం మామిడికుదురు డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. జీఓ 36 అమలు చేయాలని, 2019, 2024 వేతన సవరణ వెంటనే చేపట్టాలని, గ్రాట్యుటీ యాక్టు ప్రకారం దీన్ని అమలు చేయా లని, డ్యూటీలో పెట్టిన జీతాలను రద్దు చేయాలని, ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సును ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా 62 ఏళ్లకు పెంచాలని, 2019 తర్వాత చేరిన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని తమ డిమాండ్లపై డీసీసీబీ బ్రాంచ్ మేనే జర్‌కి వినతిపత్రం ఇచ్చారు. ఈ ధర్నాలో మండల సహకార శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోటివేషన్ తరగతులు

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అనాతవరం గవర్నమెంట్ హైస్కూల్, అయినవిల్లి మండలం లోని సిరిపల్లి ,వీరవల్లిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిట రింగ్ కమిటీ సభ్యురాలు, మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ చైర్ పర్సన్ పుణ్యమంతుల రజని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు మోటివేషన్ క్లాసు తీసుకోవడం జరిగింది. బాలికలు ప్రస్తుత పరిస్థితుల్లో చాలా జాగ్రత్తగా ఉండాలని పాఠశాలలోనూ, బయట జరుగుతున్నటువంటి ప్రతి విషయాన్ని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని విద్యార్థులకు సూచించడమైనది. విద్యార్థుల పట్ల ముఖ్యంగా ఆడపిల్లలపట్ల తీసుకుంటున్న జాగ్రత్తల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అభం, శుభం తెలియని చిన్నారులు, బాలికలపై లైంగిక దాడులు రోజురోజుకీ పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందని, అందువల్ల విద్యార్థినీలు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చిన్నారులపై దాడులకు పాల్పడుతున్న వారిలో ఎక్కువ శాతం పరిచయస్తులు, బంధువులే ఉండటం అత్యంత భయంకరమైన అంశమన్నారు. పిల్లల అమాయ కత్వాన్ని ఆసరాగా తీసుకుని తమ వాంఛ తీర్చుకునే వారు ఎక్కువైపోయారని మండిపడ్డారు. ఈ తరహా ఘటనలను నివారించాలంటే కేవలం చట్టాలు కాకుండా సామాజిక అవగాహన కూడా అవస రమని విద్యార్థినీలకు అవగాహన కల్పించారు. విద్యార్థినీలకు ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకుని వారికి గుడ్ టచ్, బాడ్ టచ్‌లపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్య క్రమంలో సిరిపల్లి, వీరవల్లిపాలెం, అనాతవరం పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు గణేశ్వ ర రావు, ప్రసాద్, కె రాధ, సంఘ సభ్యులు జంగా తనూజ , కోరుకొండ రవి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి రేవుల్లో పంట్లు మరమ్మతులు చేయండి

విశాలాంధ్ర - అమలాపురం రూరల్ : అమలాపురం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా" వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు దేవాదుల సూర్య నారాయణమూర్తి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి రేవు పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం వెళ్ళుటకు మోటార్ పంట్లు చాలా ఇబ్బంది పేడుతున్నాయని, ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారని, ప్రమాదం జరిగితే చాలా ఇబ్బంది అని, పూర్తిస్థాయి పర్యవేక్షణ పంటులపై ఉండాలని, ప్రయాణికుల సౌకర్యార్థం ప్రమాద ఘంటికలు రాకుండా చూడాలని, చించినాడ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని, ముక్తేశ్వరం, కోటిపల్లి రేవు పంటి పున నిర్మాణం చేయాలని, రేవు లేకపోవటం వలన కాకినాడ, రామచంద్రపురం వెళ్లే వారికి చాలా ఇబ్బంది పడుతున్నారని, కోటిపల్లి రేవు పంటు పునర్మానం చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే వీటిపై చర్యలు తీసుకుని ప్రజా ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొనుకు వెంకటేశ్వరరావు, కుసుమ నరసింహ రాజు, యాలంగి రామకృష్ణ, డి అనిత, పితాని బేబీరావు, కుసుమ నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమన్వయ సమావేశం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియో జకవర్గం రావులపాలెం మండలం రావుల పాలెం గ్రామంలో ఫంక్షన్ హాల్ వద్ద సోమవారం నిర్వహిం చిన డాక్టర్ బిఆర్ అంబే ద్కర్ కోనసీమ జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న శాసన మండలి ప్రతిపక్ష నేత, ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ , డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి. రివ్యూ మీటింగ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య నేతలు, ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ తీరుపై మాజీ ఎమ్మెల్యే వేమా ఆగ్రహం

విశాలాంధ్ర - రాజోలు : మండలంలోని తాటిపాక శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ విద్యార్థినుల పట్ల పలు ఆంక్షలు విధించడంపై మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమ ఆగ్రహం వ్యక్తం చేసారు. సోమవారం ఆయన బిజెపి, బజ రంగ్దళ్ సభ్యులతో కలిసి పాఠశాలకు వెళ్ళి ప్రిన్సి పాల్‌ని నిలదీసారు. ఆడపిల్లలు స్కూల్‌కి వచ్చేట ప్పుడు బొట్టు, గాజులు, చేతికి తాళ్లు, జడలో పువ్వులు పెట్టుకు రాకూడదని విద్యార్థినిల పట్ల ఆంక్షలు విధించిన ప్రిన్సిపాల్ బాలాజీ తీరుపై మండిపడ్డారు. భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు నేర్పవలసిన ప్రిన్సిపాల్ బొట్టు, గాజులు, జడలో పువ్వులు పెట్టు కోవద్దని చెప్పడంపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వేమా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అడబాల నరసింహం, యాతం కృష్ణ, ఎస్ఎస్ఎఫ్ శ్రీనివాస్, రాజా నాగరత్నకుమార్, పెసంగి రఘురాం, కొప్పిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కేరళ తరహాలో కోనసీమ టూరిజం అభివృద్ధి

సంక్రాంతికి జాతీయస్థాయి డ్రాగన్ పడవల పోటీలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండలంలోని కోనసీమ టూరిజాన్ని కేరళ తరహాలో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు తెలిపారు. సోమవారం లొల్ల లాకుల వద్ద సంక్రాంతి పర్వదినం సందర్భంగా నిర్వహించనున్న డ్రాగన్ పడవల పోటీలు, ఈత పోటీలు, పోస్టర్, బ్రోచర్, లోగోల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ పి శ్రీకర్, కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు వంటి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత సంవత్సరం నిర్వహించిన డ్రాగన్ పడవల పోటీలు, ఈత పోటీలు విపరీతమైన ఆదరణ పొందడంతో ఈ ఏడాది వాటిని మరింత విస్త ృతంగా, జాతీయ స్థాయిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం ప్రత్యేకంగా కంపెనీని రిజిస్టర్ చేసినట్లు తెలిపారు. ఆత్రేయపురం, తాడిపూడి వంతెన పరిసరాల్లో డ్రాగన్ పడవల పోటీలు, రంగవల్లుల పోటీలు, గాలిపటాల పోటీలు నిర్వహించేందుకు సర్వాంగ సన్నద్ధత చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సంక్రాంతి ముందే పండుగ వాతావరణం నెలకొనేలా ఈ కార్యక్రమాలు నిర్వహించి కోనసీమను పర్యాటక రంగంలో ప్రత్యేక స్థానం దక్కేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. స్థానికంగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం పూతరేకులు, మామిడి తాండ్ర, బొబ్బట్లు, కండ్రిగ కోవా, నార్కెడ్ మిల్లి పచ్చళ్లు వంటి వంటకాలతో ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామని చెప్పారు. వీటి కోసం ప్రభుత్వం, స్పాన్సర్స్ సహకారాన్ని పొందుతూ పెద్ద ఎత్తున ప్రమోషన్ చేపట్టనున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక నిధులు కేటాయించే అంశంపై ఆలోచిస్తున్నదనీ, జిల్లా కలెక్టర్ మహేశ్‌కుమార్ వ్యక్తిగతంగా శ్రద్ధ చూపుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పేరిట నిర్వహించనున్న ఈ పోటీలు కోనసీమ టూరిజం అభివృద్ధికి పెద్ద ఊతమివ్వనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఒ బి డిఈ రాజేంద్రప్రసాద్, ఆర్టీసీ డిపో మేనేజర్ వైవివివిఆన్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గంగుమళ్ళ శ్రీనివాస్, కెనాల్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె వెంకటేశ్వరరావు, సిఐ విద్యాసాగర్, ఆత్రేయపురం ఎమ్మార్వో టీఆర్ రాజేశ్వరరావు, ఎస్సై రాము, ఎస్టిఓ డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సామరస్యంగా సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - ఐ పోలవరం : ఐ పోలవరం మండల సర్వసభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో కొద్దిమంది ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు గైర్హాజరైనప్పటికీ, సమావేశానికి హాజరైన సభ్యులతో మండలశాఖ అధికారులతో, సభ్యులకు మండల బడ్జెట్ పై ఎంపిడిఓ దీక్షితులు వార్షిక బడ్జెట్ అంచనా వ్యయాన్ని సమావేశంలో తెలియచేసారు. అనంతరం మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు మోర్త మిరియం జ్యోతి సమావేశానికి అధ్యక్షత వహిస్తూ ఆయా శాఖల పనితీరుల పై ఆరా తీశారు. ఇరిగేషన్ డిపార్ట్మెంట్ అధికారులు పంట పొలాలకు సరఫరా అయ్యే, సాగునీరుపంట కాలువలో చెత్త చెదారం, గాజుసీసాలు, వ్యర్థాలు అధికంగా వస్తున్నప్పటికి లస్కర్లు పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని తిల్లకుప్ప సర్పంచ్ కడియం తమ్మయ్య ధ్వజమెత్తారు. పంటకాలువగట్లపై కొంతమంది అక్రమంగా కొబ్బరిచెట్లు, ఇతర మొక్కలు సాగు చేస్తున్నప్పటికి ఇరిగేషన్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని అధికారులకు తెలిపారు. దీంతో ఎంపిడిఓ జోక్యం చేసుకుని సభ్యులు లేవనేత్తిన అంశాలపై ఇరిగేషన్ అధికారితో మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు అన్యక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మండల ఎస్సి హాస్టల్ ఇంచార్జి వార్డెన్ లోవలక్ష్మి, హాస్టల్ పనితీరుపై అధికారులకు సభ్యులకు తెలియజేస్తుండగా, మండల ఎంపీడీవో, తాసిల్దార్, ఎంపీపీ మిరియం జ్యోతి జోక్యం చేసుకుని ఆడపిల్లలు పూర్తి సంరక్షణ వార్డెన్ పై ఉంటుందని నిర్లక్ష్యంవహిస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అన్నారు. ఇటీవల బాణాపురం, రానేలంక గురుకులపాఠశాల బాలికలపై జరిగిన అఘాయిత్యాలను ఎస్సీ హాస్టల్ వార్డెన్ లోవలక్ష్మికి వివరంగా సమావేశంలో తెలియచేశారు. ఆడపిల్లల భద్రత, పర్యవేక్షణ మనందరి బాధ్యత అని హాస్టల్ వార్డెన్ లోవలక్ష్మికి తెలిపారు. సమావేశంలో మండల తాసిల్దార్ విజయలక్ష్మి, ఇన్చార్జి ఎంపీడీవో దీక్షితులు, ఎంపిపి మోర్త మిరియం జ్యోతి, ఆర్డబ్ల్యూఎస్ జేఈ తేజ, డ్రైన్స్ జెఈ శ్రీలేఖ, ఈఓపిఆర్డి స్వర్జన్, తిల్లకుప్ప సర్పంచ్ కడియం తమ్మయ్య, గోగులంక సర్పంచ్, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

హుండాయ్ షోరూం ప్రారంభం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురంలో హ్యుందాయ్ షోరూం ప్రారంభించిన రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, షోరూమ్ అధినేత కంభంపాటి రాంమోహన, రావు కిమ్స్ చైర్మన్ చైతన్య రాజు, రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణ బాబు, అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ గణేష్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్, జనసేన సీనియర్ నాయకుడు శ్రీధర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పెన్మత్స జగ్గప్పరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సత్యప్రభను కలిసిన ఆసుపత్రి సూపరింటెండెంట్ సౌమ్య

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నూత నంగా బాధ్యతలు చేపట్టిన ఎ సౌమ్యకు ఎమ్మెల్యే సత్యప్రభ సూచించారు. సోమవారం పెదశంకర్లపూడి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభని ఆసుపత్రి సూపరింటెండెంట్ సౌమ్య మర్యాదపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆసుత్రి అభివృద్ధి కమిటీ వర్కింగ్ చైర్మన్ వెలుగుల నాని తదితరులున్నారు.

ఐదేళ్లలో రూ.614 కోట్ల మార్జిన్ మనీ సబ్సిడీ విడుదల

పార్లమెంట్‌లో ఎంపీ సానాసతీష్ బాబు ప్రశ్నకు కేంద్రం సమాధానం

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్రంలో ఉపాధి అవకాశాల పెంపు, గ్రామీణ, పట్టణ యువత స్వయం ఉపాధి అంశాలపై రాజ్యసభలో ఎంపీ సానా సతీష్ బాబు ప్రశ్నించారు. గత ఐదేళ్లలో ప్రధాన మంత్రి ఉపాధి సృష్టి కార్యక్రమం అమలు వివరాలను కేంద్రాన్ని ఆయన కోరారు. దీనికి రాజ్యసభలో స్పందించిన కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సుశ్రీ శోభా కరం ద్లాజే, ఒక కేంద్ర పథకం కావడంతో రాష్ట్రాల వారీగా బడ్జెట్ కేటా యింపులు ఉండవని, డిమాండ్ ఆధారంగా నిధులు విడుదల చేస్తామని తెలిపారు. 2020 - నవంబర్ 2025 మధ్య కాలంలో రాష్ట్రానికి రూ.614 కోట్ల మార్జిన్ మనీ సబ్సిడీ విడుదల చేసి నట్లు ఆమె వివరించారు. ఈ ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 16,053 సూక్ష్మ పరిశ్రమలు స్థాపించబడ్డాయని, వాటి ద్వారా సుమారు 1.28 లక్షల ఉద్యోగాలు సృష్టించబడ్డాయని చెప్పారు. ఈ పథకం ద్వారా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు అధిక ప్రాధాన్యం లభించిందని, అలాగే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళా లబ్ధిదారులకు గణనీయమైన భాగస్వామ్యం ఉన్నట్లు మంత్రి స్పష్టం చేశారు. తయారీ రంగంతో పాటు సేవల రంగంలోనూ పెద్ద ఎత్తున యూనిట్లు ఏర్పడినట్లు తెలిపారు. కాకినాడ జిల్లా విషయమై ప్రత్యేకంగా అడిగిన ప్రశ్నకు సమాధానంగా, 2022-23లో జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు 319 సూక్ష్మ పరిశ్రమలకు పీఎంఈజీపీ కింద సహాయం అందించామని, అవి తయారీ, సేవల రంగాలకు సంబంధించినవని కేంద్ర మంత్రి వెల్లడించారు. ఈ ప్రశ్న ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో యువత ఉపాధి, గ్రామీణ పారిశ్రామిక అభివృద్ధి, పారదర్శక పాలన పట్ల ఎంపీ సానా సతీష్ బాబు నిబద్ధత మరోసారి స్పష్టమైంది.

సర్టిఫికెట్లకు దరఖాస్తు చేయడంలో జాగ్రత్తలు తీసుకోవాలి

- తహశీల్దార్ రవికిరణ్

విశాలాంధ్ర - కాట్రేనికోన : రెవెన్యూ సంబంధించి కులం, ఆదాయం, ఫ్యామిలీ మెంబర్ తదితర సర్టిఫికెట్లుకు దరఖాస్తు చేసేటప్పుడు తగిన ధ్రువీకరణ పత్రాలు జత చేయడంతో పాటు తప్పులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కాట్రేనికోన తాహసిల్దార్ వి రవి కిరణ్ కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, మీ సేవ నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. కులం సర్టిఫికెట్ దరఖాస్తు చేసేటప్పుడు విద్యార్థి టిసి తప్పనిసరిగా స్కాన్ చేయాలని, చదువు లేని వారికి కుటుంబ సభ్యుల కులం సర్టిఫికెట్ నకలు లేదా ఎఫిడవిట్ జత చేయాలన్నారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసేటప్పుడు భవిష్యత్తులో లీగల్ సమస్యలు ఎదురవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తాసిల్దార్ సూచించారు. మృతిచెందిన వారి డెత్ సర్టిఫికెట్ ఒరిజినల్ లేదా జిరాక్స్ పై గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ చేయించి దరఖాస్తుకు జత చేయాలన్నారు. ఈడబ్ల్యూఎస్, ఓబీసీ సర్టిఫికెట్లకు విధిగా అఫిడవిట్‌లు జత చేయాలన్నారు. భూముల మ్యుటేషన్లు, ఎఫ్‌లైన్ దరఖాస్తులు చేసేటప్పుడుముందుగా స్థానిక వీఆర్వోలను సంప్రదించాలని, అలాగే ఆదివారం రోజున మ్యుటేషన్ దరఖాస్తులు పెట్టవద్దని తాహసిల్దార్ రవి కిరణ్ కోరారు. ఆదాయ ధ్రువీకరణ దరఖాస్తుల్లో ఏడాదికి కనీసం 90,000 నుండి ఆదాయం నమోదు చేయాలన్నారు. దరఖాస్తులు ఆన్లైన్ సమయంలో ఆధార ధ్రువీకరణ పత్రాలను విధిగా స్కాన్ చేయాలని తాహసిల్దార్ సూచించారు. ఎంపీడీవో వెంకటాచలం మాట్లాడుతూ భవిష్యత్తులో సమస్యలు ఎదురవ్వకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోజు బయోమెట్రిక్, హాజరు ఉదయం సాయంత్రం వేయాలన్నారు. దరఖాస్తుదారులు వివిధ సేవలకు సొమ్ములు చెల్లించి దరఖాస్తులు చేసుకుంటారని సర్టిఫికెట్లు తిరస్కరణ కాకుండా సకాలంలో అందేలా డిజిటల్ అసిస్టెంట్లు, మీసేవ నిర్వాహకులు బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీవో కోరారు. ఈ సమావేశంలో మండల సర్వేయర్ రాజశేఖర్, ఆర్ఐ విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

విశాలాంధ్ర - ఐ పోలవరం : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం మండల విద్యా వనరుల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథులుగా సమగ్ర శిక్ష ఏఎంఓ (అకాడమీక్ మానిటరింగ్ ఆఫీసర్), స్పెషల్ ఆఫీసర్ కృష్ణ హాజరై విద్యార్థులుతో మాట్లాడతూ అంగవైక ల్యాన్ని జయిస్తూ, మానసిక ధైర్యాన్ని కోల్పోకూడదని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కేక్ కట్ చేయించి వారితో ఆహ్లాదంగా ముచ్చటించి ప్రతి ఒక్కరికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ 1 నల్లమిల్లి కొండారెడ్డి, ఎంఈఓ 2 వీధి సురేష్ బాబు, నోడల్ జిహెచ్ఎం నక్కా ప్రసాద్ కుమార్, జిహెచ్ఎం సుభద్ర లక్ష్మి, దేవి, డాక్టర్ పి వెంకటేశ్వరరావు, ఐ ఆర్పీలు రవివర్మ, పావని, సీఆర్పీలు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన ప్రత్యేక శిబిరం

విశాలాంధ్ర - గండేపల్లి : ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ నిర్వహించిన 7-రోజుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం సురంపాలెంలో విజయవంతంగా ముగిసింది. చివరి రోజు వాలంటీర్లు గ్రామమంతా తిరిగి సాక్షరత సర్వే నిర్వహించి, విద్య ప్రాధాన్యత, పెద్దల సాక్షరత మరియు సామాజిక అభివృద్ధిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం శిబిరం ముగింపు కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారిశెట్టి గంగాభవాని, గ్రామ పెద్దలు కుంచె రాజా, తదితర గ్రామస్తులు ఈ కార్యక్రమానికి హాజరై, శిబిరం మొత్తం కాలంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేసిన సేవలను అభినందించారు. అనంతరం మొత్తం పాల్గొన్నవారికి సర్టిఫికెట్లను అందజేశారు. జి ప్రసూన, హైస్కూల్ సోషల్ టీచర్, ఈ కార్యక్రమానికి హాజరై, సమాజ సేవలో యువత పాత్ర పై విలువైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ప్రో-చాన్సలర్ డా ఎం శ్రీనివాస రెడ్డి ఎంతో సమగ్రంగా ప్రసంగించి, గ్రామస్తులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు అధ్యాపకులు శ్రద్ధతో నిర్వహించిన సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో డీన్ డా డి కిషోర్ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ద్వారా విద్యార్థులు గ్రామీణ అభివృద్ధి, సామాజిక సమస్యలు, మరియు కమ్యూనిటీ అవసరాలను మరింత సమగ్రంగా అర్థం చేసుకుంటారని పేర్కొన్నారు. గ్రామస్తులు, వాలంటీర్లు కలిసి శిబిరాన్ని విజయవంతం చేసిన తీరు ప్రశంసనీయమని డా కిషోర్ ప్రత్యేకంగా అభినందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా బి రాంబాబు, కె రఘు వంశీ (అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇసిఇ) ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శిబిరం విజయవంతం కావడానికి సహకరించారు.

హిందూ సమ్మేళనానికి తరలి రావాలి

విశాలాంధ్ర - మామిడి కుదురు : ఈ నెల 14వ తేదీ ఆదివారం గోగన్నమఠం గ్రామంలో జరిగే హిందూ సమ్మేళనంకి హిందువులు భారీ సంఖ్యలో ఈ సమ్మేళనానికి తరలి రావాలని నిర్వహణ సమితి అధ్యక్షులు భూపతిరాజు సత్యనారాయణరాజు (సత్తిబాబురాజు) తెలిపారు. ఈ సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. 14వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఈ సమ్మేళనం జరుగుతుందన్నారు. శృంగవృక్షం పీఠాధిపతులు సాయిదత్త నాగానంద సరస్వతి స్వామీజీ ప్రధాన వక్తగా హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

పాశర్లపూడిలో వైభవంగా శ్రీకృష్ణ జాంబవతి కల్యాణం

విశాలాంధ్ర - మామిడి కుదురు : సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాశర్లపూడి సత్రంలో సోమవారం శ్రీకృష్ణ జాంబవతి కల్యాణం వైభవంగా జరిపించారు. రాజోలు ఖండ ధర్మ ప్రచారక్ బైరిశెట్టి కోటేశ్వరరావు ప్రధాన కర్తగా పాల్గొన్ని శ్రీకృష్ణ జాంబవతి కల్యాణం మహోత్సవాన్ని జరిపించారు. ఆది జాంబవణులు ఆధ్వర్యంలో ఈ కల్యాణ మహోత్సవ ఘట్టాన్ని కన్నుల పండుగలా జరిపించారు. ప్రాంత సంస్కృతి ఉపాధ్యక్షుడు దూర్వల ప్రభాకరశర్మ సారధ్యంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో కోనసీమ జిల్లా ధర్మ ప్రచారక్ కె ధర్మారావు, చుట్టుగుళ్ల కిశోర్, మంద గాంధీ, పాశర్లపూడి దుర్గారావు, ఉండ్రాజవరపు శివ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర స్వామికి విరాళం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి గాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తులు స్వామివారి వసంత మండపంలో కళ్యాణం, అష్టోత్తర పూజలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. చందన సరూపుడైన వెంకటేశ్వర స్వామి వారిని భక్తులు దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఈ ఆలయ సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి ఆచంట మండలం, కరుగోరుమిల్లి వాస్తవ్యులు కంతంశెట్టి సత్యకృష్ణ, జోషిత నాగ వెంకట్, వారి కుటుంబ సభ్యులు రూ.30,116 విరాళంగా సమర్పించారు. వీరికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు, పులపర్తి రాంబాబు వర్మ, శ్రీనివాస్, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మైనార్టీ కమిటీ చైర్మన్‌ను కలిసిన షేక్ మీరా

విశాలాంధ్ర - నల్లజర్ల : మండలంలోని ఆవపాడు గ్రామానికి చెందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మీరా. విజయవాడలో స్టేట్ హజ్ కమిటీ బోర్డ్ సమావేశంలో గుంటూరు ఈస్ట్ శాసన సభ్యులు ఏపీ అసెంబ్లీ మైనార్టీ కమిటీ చైర్మన్, మొహమ్మద్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మీరా కలిశారు.

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా నాలుగోసారి శ్రీధర్ ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా నని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్ శ్రీధర్ అన్నారు. జిల్లాలో యుటిఎఫ్ కార్యదర్శిగా ఎన్నికైన శ్రీధర్ సోమవారం మాట్లాడారు. ఉపాధ్యాయులకు పదవీ విరమణ అనంతరం రావలసిన పెన్షన్, అన్ని సదుపాయాలను ఉచితంగా సబ్ ట్రెజరీ ఆఫీసులో తన సొంత ఖర్చులతో రిటైర్డ్ ఉపాధ్యాయులకు సర్వీస్ చేస్తున్నట్టు తెలిపారు. నాలుగవసారి జిల్లా కార్యదర్శిగా తనను ఏకగ్రీవంగా ఎంపిక చేసిన అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని హైస్కూల్లో 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఆదివారాలను, పండగ రోజులను 100% ఉత్తీర్ణత పేరుతో ప్రతిరోజు సాయంత్రం పరీక్ష నిర్వహించి మార్కులను అప్లోడ్ చేయాలని ఒత్తిడి చేయడంపై ఉపాధ్యాయలోకం ఆందోళన చెందుతున్నారన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని, ఉపాధ్యాయులకు స్వేచ్ఛగా బోధించే అవకాశాన్ని కల్పించాలన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌ను పలువురు అభినందించారు.

క్రీడల్లో మోగల్లు విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర- పాలకోడేరు : ఈనెల ఆరవ తేదీన భీమవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలలో పాలకోడేరు మండలం మోగల్లు ఏ ఎస్ ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.రామకృష్ణ మూడు బంగారు పతకాలు సాధించినట్లు ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యా యుడు కె. సూర్య సోమవారం స్థానిక పాత్రికేయులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థి రామకృష్ణ 100 మీటర్ల రన్నింగ్ రేస్, షాట్ పుట్, డిస్కస్ త్రో పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అత్యధిక పతకాలు సాధించాడని, ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు ప్రోత్సహించుటకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి వారిలో ఉన్న ప్రతిభను బయటకు తీయడం గర్వకారణం అని తెలిపారు. బంగారు పతకాలు సాధించిన రామ కృష్ణను పాఠశాల ప్రధానోపాధ్యాయులు త్రినాధులు, ఇతర ఉపాధ్యాయులు,గ్రామస్తులు అభినందించారు.

మానవసేవే మాధవసేవ



విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మానవసేవే మాధవసేవ అని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి పేర్కొన్నారు. మండలంలోని అంకాల గూడెం గ్రామంలో ఉన్న వికలాంగుల ఆశ్రమం వద్ద సోమవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్స వం నిర్వహించారు. పరింపూడి గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి ఆర్థిక సహాయంతో ఏర్పాటుచేసిన 20 రగ్గులను 20 మంది వికలాంగులకు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన మేఘలాదేవి, తాడికొండ మురళీకృష్ణ మాట్లాడుతూ మనకున్న దాంట్లో వికలాంగులకు, వృద్ధులకు, బీదలకు ఖర్చు చేసి వారికి సహాయ సహకారాలు అందించడం సంతోషం కలిగిస్తుందన్నారు. వికలాంగు లను, వృద్ధులను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ పెద్ద మనసు చేసుకొని ముందుకు రావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ ముప్పిడి చినబాబు, ఏలేటి చంద్రం, చిడిపి రవి, గున్నేపల్లి సుబ్బారావు, కారం భీమరాజు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మల్లిపూడికి కలాం జాతీయ ఎక్సలెన్సీ అవార్డు

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఈ నెల 7 న హైదరాబాద్ సుందరయ్య కళానిలయంలో నిర్వహించిన 25 వ వార్షికోత్సవంలో ఉంగుటూరుకి డాక్టర్ మల్లిపూడి చినబాబుకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ ఎక్సలెన్సీ అవార్డును అందచేశారు. వెటర్నరీ లైఫ్ స్టాక్ అధికారిగా సేవలు అందిస్తున్న డాక్టర్ మల్లిపూడి అందిస్తున్న విశిష్టసేవలకు ఈ అవార్డు అందజేసినట్లు ఆ సంస్థ అధ్యక్షుడు ఇ. సూర్యనారాయణ రాజు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు డాక్టర్ మల్లిపూడి పశు వైద్య రంగంలో చేస్తున్న సేవలు కొనియాడారు. కార్యక్రమంలో మందాడి కృష్ణారెడ్డి , జాతీయ వినియోగ దారుల మండలి అధ్యక్షులు, కేంద్ర ఫిలిమ్ సెన్సార్ బోర్డు సభ్యులు,తెలంగాణ ఎఫ్‌సిఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డాక్టర్ వేమూరి గౌరీ శంకర్‌రావు, కుల నిర్మూలన సంఘం గౌరవ సలహాదారులు వి.లక్ష్మీ నాగేశ్వర్, బండారు సుజాత శేఖర్, ప్రముఖ కవి, రచయిత్రి, ఇ. సూర్యతేజ్, టీవీ కోరియోగ్రాఫర్ సుబ్రాంత్,తదితరులు ఈ అవార్డు ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం సేవలు నీతి నిజాయితీకి భావితరాలకు మైలురాయి అన్నారు. ఈ అవార్డుతో 37 అవార్డులు అందుకున్నారు.

1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలి



విశాలాంధ్ర - కొయ్యలగూడెం : 1973 సీలింగ్ చట్టం,1/ 70 చట్టం పటిష్టంగా అమలు చేయాలని జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెం, కేతవరం, కొయ్యలగూడెం మండలం రాజవరం, మంగపతి దేవి పేట, బుట్టెంపేట, గ్రామాలలో ఉన్న వందల ఎకరాల సీలింగ్ భూములను సుప్రీంకోర్టు, హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం పేద ప్రజలకు పంచాలని సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నకుటి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో సోమవారం నవ్యాంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనరల్ బాడీ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు మందలపల్లి రాజు అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జొన్నకుటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు మాదేపల్లి వెంకటరత్నం, మాట్లాడుతూ కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండ లాల్లో వివిధ గ్రామాలలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ సీలింగ్ భూములను పేద ప్రజలకు పంచి పెట్టి, వారికి ఉపాధి కల్పించడానికి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర కోకన్వీనర్ ధన కుదరం రంగనాథం, ఆదివాసి భారత మహాసభ రాష్ట్ర కార్యదర్శి మడకం రామన్న, మట్టపర్తి వెంకట్రావు, గొన్నూరి ఆనందరావు, కామన సత్యనారాయణ, మహిళా సంఘ నాయకులు గన్నమని నాగమణి, కే. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

త్రాగునీటి సమస్య పరిష్కరించండి

విశాలాంధ్ర - ఏలూరు: దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె.అభిషేక్ గౌడ ను కలిసి ఏలూరు కృష్ణా కాలువకు అండర్ టన్నెల్ నిర్మాణం కారణంగా కృష్ణ కాలువకు నీరు నిలుపుదల కారణంగా త్రాగునీటి ఎద్దడి ఎదురయ్యే పరిస్థితి వస్తుందని,దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయవలసిందిగా కోరారు. ఏలూరు కృష్ణా కాలువకు 12 కి.మీ. వద్ద అండర్ టన్నెల్ నిర్మాణం నిమిత్తం రానున్న జనవరి, 1 వతేదీ నుండి జూన్ వరకు అనగా ఆరు నెలలపాటు నీరు విడుదల నిలిపి వేస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రకటించారని, దీని కారణంగా పెదపాడు, ఏలూరు మండలాల్లో ఇప్పటి నుండి కాబోయే వేసవి వరకు ప్రజలకు తీవ్ర త్రాగునీరు సమస్య ఏర్పడుతుందని, పోలవరం ప్రాజెక్ట్ కుడి ప్రధాన కాలువ నుండి నీటి సరఫరాకు ప్రత్యేక ఏర్పాటు చేయవలసిందిగా ఎమ్మెల్యే జేసీ ని కోరారు. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ అధికారులను తగు సూచనలు జారీచేయవలసిందిగా చింతమనేని ప్రభాకర్ జాయింట్ కలెక్టర్ ని కోరారు. సదరు సమస్య పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ సూపెరింటెండింగ్ ఇంజనీర్ ను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

బంగారం చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

48 గ్రాములు బంగారం ఆభరణాలు స్వాధీనం

విశాలాంధ్ర - నిడమర్రు: బంగారు ఆభరణాలు చోరీ కేసులో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు నిడమర్రు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నక్కా రజినీ కుమార్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం రాత్రిపూట జరిగిన దొంగతనం కేసును చేదించి సేదించినట్లు ఆయన తెలిపారు. నిడమర్రు మండలం గుణపర్రు గ్రామానికి చెందిన కాకులపాటి పూర? సుభాష్ ను అరెస్టు చేసి అతని వద్ద ఉన్న 48 గ్రాముల బంగారు ఆభరణాలు సుమారు ఆరు లక్షల విలువ చేసే స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిడమర్రు ఎస్ఐ ఎస్ ఎన్ వి వి రమేష్, బి. శ్రీను జి. ఆంజనేయులు , వై.యోగేశ్వర్ ఈ కేసును ఛేదించినట్టు తెలిపారు.

సామాన్యుల సమస్యలపై స్పందించిన మంత్రి

48 గంటల్లో వ్యక్తిగత నిధులతో పనులు

విశాలాంధ్ర- చాట్రాయి: చనుబండ లోని బలహీనవర్గాల నివాస ప్రాంతంలో సామాన్య ప్రజలు డ్రైనేజీ లో తూరలు సమస్యను చెప్పిన 48 గంటల్లోనే మంత్రి వ్యక్తిగత నిధులతో చేయించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజుల క్రితం చాట్రాయి మండలం చనుబండ గ్రామానికి వచ్చిన మంత్రితో కోర్లమండ రోడ్డు లో సైడ్ రోడ్ కు వెళ్ళే దారిలో పైపులు పాడై నడవడానికి కూడా వీలు లేకుండా ఉండి ప్రమాదాలు జరుగుతున్నాయని దేశిన చెన్నారావు సమస్యను ప్రత్యక్షంగా చూపించారు. స్పందించిన మంత్రి సారధి సోమవారం పనులు చేయించారు. కార్యక్రమంలో మంత్రి పీఏ గణేష్ చనుబండ సొసైటీ చైర్మన్ మోరంపూడి శ్రీనివాస రావు, నక్కా రాము, మారేశ్వర రావు, మోరంపూడి సురేష్, పరసా శ్రీను, వీ ఏ వో నాగరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ దివ్య, ఇంచార్జ్ పీ ఆర్ ఏ ఈ రఘు, తదితరులు పాల్గొన్నారు.

విద్య, వ్యక్తిత్వ వికాసం విజయానికి మార్గం

విశాలాంధ్ర-కైకలూరు: విద్యార్థుల విజయానికి విద్య వ్యక్తిత్వ వికాసము సరైన మార్గమును చూపుతాయి అని కైకలూరు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు గుర్రం కుమార్ అన్నారు. కైకలూరు మానవతా ఆధ్వర్యంలో బుజబలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో ఉపాధ్యాయులు పి. నరసింహారావు అధ్యక్షతన 10 వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉమ్మడి కృష్ణాజిల్లా కెరియర్ గైడెన్స్ చైర్మన్ ప్రొఫెసర్ సుదాబత్తుల విజయకుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు పదవ తరగతి తరువాత ఉన్నటువంటి అనేక రకాల ఉన్నత విద్య వృత్తి వ్యాపార పరిశ్రమల వ్యవసాయ అనుబంధ అవకాశాలను వివరించారు. తమ ప్రతిభతో ఉన్నత శిఖరాలను అందుకోవటంలో చదువు వ్యక్తిత్వ వికాసం జీవన నైపుణ్యాల పాత్రను వివరణాత్మకంగా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కైకలూరు మానవతా స్వఛ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కొండ్రెడ్డి చిట్టెమ్మ, కార్యదర్శి బోయిన సత్యప్రభ, కోశాధికారి టి మోహన్, తలారి గోపాలకృష్ణ, సయ్యద్ జమీల్ అహమ్మద్, ఇమ్మడి విట్టల్, రుద్రపాక రత్నాకర్ రావు, పెద్దింటి కల్యాణి, సిహెచ్. కనకదుర్గ, ఉద్దగిరి విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లయన్ ఆఫ్ ది డిస్ట్రిక్ట్‌గా ముత్యాల రామారావు

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లుకు చెందిన సీనియర్ పాత్రికేయుడు ముత్యాల రామారావు లయన్స్ 316డి కృష్ణా జిల్లాలో 2024-25 సంవత్సరానికి 'లయన్ ఆఫ్ ది డిస్ట్రిక్ట్'గా ఎంపికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన అవార్డ్స్ ఫంక్షన్ లో 2024-25 లయన్స్ జిల్లా గవర్నర్ లయన్ గద్దె శేషగిరి ఈ అవార్డును రామారావుకి అందజేసారు. ఈ అవార్డ్ తో పాటు రామారావుకి 'ఇంటర్నేషనల్ ప్రెసిడెన్షియల్ మెడల్' కూడా లభించింది. ఈ మెడల్‌ను జిల్లా గవర్నర్ లయన్ వి.వి.పి.ఎస్. ఆంజనేయులు సమక్షంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ డి. సుభాష్ బాబు రామారావుకు అందజేసారు.'రత్న ప్రింటింగ్ వర్క్స్' అధినేతగా పశ్చిమగోదావరి జిల్లా ప్రజలకు చిరపరిచితులైన రామారావు గత 28 సంవత్సరాలుగా లయన్స్ క్లబ్ లో వివిధ హెూదాల్లో సేవలందించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అనేక అవార్డులు అందుకొన్నారు. పాత్రికేయ జీవితం నేపథ్యంగా ఉన్న రామారావు లయన్స్ క్లబ్స్ 'జిల్లా గవర్నర్స్ న్యూస్ లెటర్' ఎడిటర్ గా రెండుసార్లు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఎడిటర్ అవార్డ్ పొందారు. 'మోస్ట్ కమిటెడ్ లయన్ ఆఫ్ ది డిస్ట్రిక్ట్' వంటి ప్రతిష్టాత్మక అవార్డులు పొందారు. గత సంవత్సరం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ 'జిల్లా సెక్రటరీ'గా ఎంపికయ్యారు. ముత్యాల రామారావు లయన్స్ క్లబ్ లోనే కాక 'మానవత' స్వఛ్ఛంద సేవాసంస్థ కార్యక్రమాలలో కూడా చురుగ్గా పాల్గొంటూ, పాలకొల్లు మండల శాఖ కన్వీనర్ వ్యవహరిస్తున్నారు.

పిఎసిఎస్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

విశాలాంధ్ర - కలిదిండి: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని సిబ్బంది ధర్నా నిర్వహించారు. సోమవారం స్టేట్ యూనియన్ పిలుపు మేరకు స్థానిక కోపరేటివ్ బ్యాంక్ వద్ద మండలంలోని పి ఎ సి ఎస్ లు, సిబ్బంది జీవో నెంబర్ 36 వెంటనే అమలు చేయాలని కోరారు, 2019 లో చేరిన వారిని రెగ్యులర్ చేసి పర్మినెంట్ చేసి హెచ్ఆర్ పాలసీ అమలు చేసి 2019 - 24లో పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ చేసి మధ్యంతర భృతి కల్పించాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.20 లక్షలు ఇన్సూరెన్స్ పాలసీ చేసి కుటుంబానికి భరోసా కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు వలే సహకార సంఘాలలో పనిచేసే ఉద్యోగులకు రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని నినాదాలు చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బ్రాంచి మేనేజర్‌కు అందజేశారు. ఈ ధర్నాలో పిఎసిఎస్ సెక్రటరీలు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

12న కలక్టరేట్‌లో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర -భీమవరం: 12న కలక్టరేట్ లో జరిగే రక్తదాన శిబిరంపై జిల్లా అధికారులు తమ ఉద్యోగులతో పాటు, అనుబంధ సంస్థల ఉద్యోగులలో రక్తదానంపై అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ 2026వ సంవత్సర వార్షిక రక్తదాన శిబిరాల ఏర్పాటు గోడ పత్రికను జెసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పశ్చిమగోదావరి జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బందితో 2025 డిసెంబర్ 1 నుండి 2026 నవంబర్ 30 వరకు సంవత్సర పొడవునా రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి నెలలో 1వ మరియు 3వ శుక్రవారం ఒకొక్క శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం మొదటి రక్తదాన శిబిరం 12న కలెక్టరేట్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు తమ ఉద్యోగులతో పాటు అనుబంధ సంస్థల ఉద్యోగులను కూడా రక్తదానానికి ప్రోత్సహించాలని ఆయన సూచించారు. గత సంవత్సరం జిల్లాలో రక్తదాన శిబిరాలలో ప్రభుత్వ ఉద్యోగులు 1,166 యూనిట్లు రక్తాన్ని దానంగా అందజేశారన్నారు. ముఖ్యంగా వ్యవసాయ, విద్య, డ్వామా, డీఆర్‌డీఏ, కార్మిక శాఖల అధికారులు, సిబ్బంది చురుకుగా పాల్గొని, రక్తదానంలో విశేషంగా సహకరించినందుకు జాయింట్ కలెక్టర్ ఆయా శాఖాధికారులను అభినందించారు. రక్తదానంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ సంవత్సరం నిర్దేశించిన 2,000 యూనిట్ల లక్ష్యం చేరుకునేందుకు అధికారులు సిబ్బంది తమ వంతు సహకరించాలని కోరారు. ఈ రక్త సేకరణ ద్వారా తలసేమియా రోగులు, రక్తహీనత బాధితులు మరియు అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి ప్రాణదానం చేసిన వారు అవుతామన్నారు. సమావేశంలో డిఆర్‌ఓ బి.శివన్నారాయణ రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసి రెడ్డి, డ్వామా పీడి డాక్టర్ కే సి హెచ్ అప్పారావు, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ భద్రి రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మర్లపాలెంలో 8.75 లక్షల ఎరువులు సీజ్

విశాలాంధ్ర -చాట్రాయి : మర్లపాలెంలో 8.75 లక్షల విలువైన ఎరువులు సీజ్ చేసినట్లు చాట్రాయి మండల వ్యవ సాయ అధికారి బి.శివశంకర్ తెలి పారు. సోమవారం చాట్రాయి మండలం మర్లపాలెం గ్రామంలో ఏడిఏ జి. వెంకటమణితో కలిసి చేసిన తనిఖీలలో అమ్మకాలకు, రికార్డులకు, ఎరువుల నిల్వలకు పొంతన లేకపోవడం వలన 8.75 లక్షల విలువైన ఎరువులను అమ్మకాలు నిలిపివేసినట్లు ఆయన తెలిపారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు బిల్లులు తీసుకోవాలన్నారు.

బూత్ కమిటీలు కీలకంగా పనిచేయాలి

విశాలాంధ్ర - నల్లజర్ల : బూత్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మండల పార్టీ అధ్యక్షులకు సూచించారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం మంగళగిరిలో తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమం లో పాల్గొని, వారికి శిక్షణ ఇచ్చిన గోపాలపురం నియోజకవర్గం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట రాజు మాట్లాడుతూ బూత్ కమిటీలు బలోపేతంగా ఉండాలని విజయం కోసం ప్రతి బూత్ లో కష్టపడి పనిచేయాలన్నారు. సమస్యలు పెరగకుండా నియంత్రించాలని. వాటిని ముందుగా గుర్తించాలని సూచించారు. కార్యకర్తల ప్రేరణ శక్తి సమర్థవంతమైన కార్యక్రమాలు చేపట్టాలన్నారు . ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేద ప్రజల ఆరోగ్యానికి అండ

విశాలాంధ్ర - కొవ్వూరు : సీఎం సహాయనిధి పేద ప్రజల ఆరోగ్యానికి అండగా ఉంటుందని శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం తిరుగుడు మెట్ట అన్నదేవరపేట తాళ్లపూడి చాగల్లు మండలం ఊ నగట్ల దారవరం చాగల్లు మార్కండేపాడు చంద్రవరం గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు రు 6,01,327 ల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సోమవారం కూటమి నాయకులతో కలిసి శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అందజేశారు. శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఎంతోమందికి ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత ధైర్యం ఇస్తుందని కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టుమెన్ కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ చిన్ని సీనియర్ తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

14న గోపాలపురం యూనిట్ ఏపీ ఎన్జీవో ఎన్నికలు

విశాలాంధ్ర-గోపాలపురం : ఈ నెల 14 న ఏపీఎన్జీఓ గోపాలపురం యూనిట్ ఎన్నికలు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తూర్పుగోదావరి జిల్లా అడహక్ కమిటీ కో చైర్మన్ , గోపాలపురం ఎన్నికల అధికారి ఎస్. ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు.ఆయన మాట్లాడుతూ గోపాలపురం యూనిట్లో తాళ్లపూడి,దేవరపల్లి గోపాలపురం మూడు మండలాలు ఉంటాయని ఈ మూడు మండలాల్లో గల వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న గెజిటెడ్ మరియు నాన్ గెజిటెడ్ ఉద్యోగులందరూ పాల్గొనవచ్చు అని అన్నారు. ఈ ఎన్నికలో అధ్యక్షులు బి1 సహ అధ్యక్షులు బి1 వైస్ ప్రెసిడెంట్లుబి3 సెక్రటరీబి1 జాయింట్ సెక్రటరీ బి3 జాయింట్ సెక్రెటరీ ఉమెన్ 1 ట్రెజరర్‌బి1 మొత్తం 11 పోస్టులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. 14వ తేదీన జరిగే ఏపీఎన్జీవో ఎన్నికలలో పాల్గొనాలని కోరారు.

జీతాలు ఇవ్వండి మహాశయా !

విశాలాంధ్ర - తాళ్లపూడి: ప్రభుత్వ ఉద్యోగికి నెల అయ్యేటప్పటికీ రెంట్ కు, కరెంట్ కు, ఇంట్లో ఖర్చులు, ఈ.ఏం.ఐ లు సిద్ధంగా ఉంటాయి కానీ ఈ నెల 8వ తేదీ వచ్చినప్పటికీ ఇంతవరకు జీతాలు జమకాలేదు అని జే.ఏ.సి చైర్మన్, రాష్ట్ర ఆపెస్సా జెనరల్ సెక్రటరీ జోడాల వెంకట్ ఒక ప్రకటన లో ఆవేదన చెందారు.ఇప్పటివరకు ప్రణాళిక శాఖ ,సాంఘిక సంక్షేమ శాఖ, రవాణా, భవనాల శాఖ,పంచాయతీరాజ్, పౌర సరఫరాల శాఖ,ఇంజనీరింగ్ వంటి శాఖలకు జీతాలు లేనందున తీసుకున్న రుణాలకు చెక్ లు బౌన్స్ అయ్యే ప్రమాదం, సిబిల్ స్కోర్ తగ్గి భవిష్యత్‌లో లోను కూడా రాదని తెలిపారు. పిల్లల ఫీజులు, ఇలా అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నందున వెంటనే జీతాలు చెల్లించాలని జోడాల అన్నారు.

పార్డ్ ఇండియా సేవా మహోత్సవ సమావేశం

విశాలాంధ్ర -నల్లజర్ల : సమాజ సేవ పట్ల ప్రతి వ్యక్తి చూపే మానవత్వమే మనిషి అసలు లక్షణమని పార్డ్ ఇండియా స్వచ్ఛందసేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బేతాళ వీరస్వామి పేర్కొన్నారు. పార్డ్ ఇండియా స్థాపించి 15 ఏళ్లు పూర్తైన సందర్భంగా నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామ శివారులో నిర్వహించిన సేవా మహోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సంస్థ అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. వీరస్వామి మాట్లాడుతూ బాల్యంలో కష్టాలను ఎదుర్కొంటూ విద్య సాధించి దేశ,విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఎదిగిన తర్వాత సమాజానికి తిరిగి సేవ చేయాలన్న సంకల్పంతో పార్డ్ ఇండియా సంస్థను ప్రారంభించానన్నారు. యర్నగూడెం వంటి మారుమూల ప్రాంతంలో ప్రారంభమైన సంస్థ, నేడు జిల్లా, రాష్ట్ర, దేశ, విదేశ స్థాయిలో విస్తరించడం తమ సేవా సిద్ధాంతానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. సంఘమిత్ర విద్యాలయ దూబచర్ల నందు మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. దాతల సహకారంతో 16 మందికి ఉచిత కుట్టుమిషన్లు లబ్ధిదారులకు అందజేశారు. సంఘం అభివృద్ధికి విశేషంగా సేవలందించిన 50 మందిని ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. 100 మంది నూతన సభ్యులకు సభ్యత్వ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలోకారుమంచి గణేష్, నెక్కంటి వెంకటేష్, అచ్యుతరావు, చీమకుర్తి కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

విశాలాంధ్ర- పాలకోడేరు :అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పాలకోడేరు మండలంలో మండల విద్యాశాఖ అధికారి పెనుమత్స వెంకట శివ నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలను వారి తల్లిదండ్రులు భవిత కేంద్రానికి పంపించడం వల్ల పిల్లల్లో చాలా వరకు మార్పు వచ్చిందని, సి డబ్ల్యూ ఎస్ ఎన్ పిల్లలు మామూలు పిల్లలతో ఉండటంవల్ల వారిలో మార్పు వస్తుందని, వీరికి ప్రభుత్వం పారా ఒలింపిక్స్ నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన పిల్లలు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనాలు చేశారు. ప్రతి ఒక్క దివ్యాంగ విద్యార్థికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రమణ రాజు, ప్రసాద్, సింహాచలం, చంద్రకళ, ఐఇఆర్‌టి ఉపాధ్యాయులు ఝాన్సీ, జానకి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కారు దగ్ధం

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండలం యర్రమిల్లిపాడు - లక్ష్మీ నగర్ దారిలో ఆదివారం రాత్రి ప్రమాద వశాత్తు కారు పూర్తిగా దగ్ధమైంది. యర్రమిల్లి పాడుకు చెందిన తమ్మినేని రోహిత్ చౌదరి దేవరపల్లి నుండి ఇంటికి వస్తుండగా కారులో పొగలు రావటాన్ని గమనించి లక్ష్మీ నగర్- యర్రమిల్లిపాడు రహదారి మార్గంలో పక్కన రోడ్డు పక్కన ఆపారు. బాయ్ నెట్ తెరవగానే ఒక్కసారిగా మంటలు వ్యాపించి కారు పూర్తిగా కాలిపోయింది. భీమడోలు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసినప్పటికీ అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. కారులో రోహిత్తో పాటు అతని స్నేహితుడు ప్రాణాలతో సురక్షితంగా బయటపడ్డారు.

బీసీలకు జగన్ క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర కైకలూరు: బీసీ సామాజికవర్గానికి చెందిన ఉన్నతాధికారులు కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య, సీనియర్ ఐపీఎస్ అధికారి జి.గోపీనాథ్‌ను అవమానిస్తూ వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుబోయిన శ్రీనివాసరావు (బిఎస్సార్) సోమవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు.మాజీ ఐఏఎస్, బీసీ కులానికి చెందిన కృష్ణయ్య యాదవ్, ఐపీఎస్ అధికారి గోపీనాథ్ జెట్టిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ సీఎం జగన్ యాదవులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గోపీనాథ్ జెట్టి, కృష్ణయ్యలను వాడు.. వీడు అంటూ సంబోధించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.జగన్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, క్షమాపణ చెప్పాలని (బిఎస్సార్) డిమాండ్ చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

విశాలాంధ్ర- ఉంగుటూరు : పేదల జీవితాల్లో ముఖ్యమంత్రి సహాయనిధి ఆశా కిరణం అని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సోమవారం ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద 72 మంది లబ్ధిదారులకు రూ. 40,18,073లు విలువ గల సీఎం రిలీఫ్ పండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవారి ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఈ క్రమంలోనే ఉంగుటూరు నియోజక వర్గంలో ఇప్పటివరకు 451 మంది లబ్ధిదారులకు గాను 3,69,20,557 రూపాయలు మంజూరు చేసినట్టు తెలిపారు.

జిల్లాస్థాయి చదరంగం పోటీల్లో మక్కినవారిగూడెం విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-టి.నరసాపురం: జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో మక్కినవారిగూడెం హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి నట్లు హెచ్ ఎం ఎల్ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. జంగారెడ్డిగూడెం మమత హాస్పిటల్ వారి సౌజన్యంతో పట్టణంలోని ఇండియన్ డిజిటల్ స్కూలులో ఆదివారం నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లా స్థాయిలో డి.ఉత్తేజ్ ద్వితీయ స్థానం, కె వెంకట సాయి కృష్ణతృతీయ స్థానం సాధించగా, వై.అన సూర్య తేజ నాలుగవ స్థానం, పి.భార్గవ్ తేజ అయిదవ స్థానం సాధించినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు టోర్నమెంట్ నిర్వాహకులు మెడల్, ప్రశంస పత్రంతోపాటు నగదు బహుమతి అందించినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో విజేతలకు అభినందన సభను ఏర్పాటు చేశారు. గెలుపొందిన విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జి.రమేష్ ను అభినందించారు. విజేతలను పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, తల్లిదండ్రులు, పలువురు గ్రామస్తులు అభినందించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-మండవల్లి: సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన పెంపు కోసం ఏపిఎం జి.రాజశ్రీ,మండల సమైక్య అధ్యక్షులు స్వర్ణకుమారి ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది గ్రామాల్లో ఆర్.టి.ఐ చట్ట ప్రాధాన్యత, ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత, బాధ్యతాయుత పాలనకు ఆర్టిఐ కీలక సాధనమని ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలు,మహిళా సంఘాల బలోపేతం,సభ్యులకు ఆర్టిఐ చట్టం, దరఖాస్తు విధానం, ప్రభుత్వ కార్యాచరణలో పారదర్శకత వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ సంఘాల ఈసీ సభ్యులు, వి.ఒ.ఎ., సి.సి.లు, స్త్రీనిధి మేనేజర్, జాబ్ రిసోర్స్ పర్సన్స్ ఇతర ఏరియా సిబ్బంది పాల్గొన్నారు.